ఐదేళ్ల అరాచకం

మరిచారా స్వాములూ ?



కుర్చీమీద ఉన్నపుడు ఒక తీరు.. దిగిపోతే ఇంకో తీరా?

అధికారంలో ఉన్నపుడు విపక్షాల మీద నోటికి ఎంతొస్తే అంతా మాట్లాడారు. వారి కుటుంబాలనూ సోషల్ మీడియా బజారుల్లోకి ఈడ్చారు. ఆడవాళ్ల మీద అసభ్యకరంగా పోస్టులు పెట్టారు. ఫోటోలు మార్ఫింగ్ చేశారు. వాయిస్ మార్చేశారు. అతుకులు వేసి అబద్ధాలు సృష్టించారు. గోబెల్స్‌ను తలదన్నేలా ప్రవర్తించిన నాయకుల నోట ఇప్పుడు భావప్రకటనా స్వేచ్ఛ గురించిన ప్రవచనాలు వినిపిస్తున్నాయి. మీడియాను అణగదొక్కేస్తున్నారని ఆక్రోశిస్తున్నారు. అధికార పీఠంపై నుంచి అమానవీయంగా ప్రవర్తించినవారే ఇప్పుడు నీతి పలుకులు వల్లిస్తున్నారు. తల్లినీ, చెల్లినీ కూడా వదలని రాజకీయ సోషల్ రాక్షసులను నిస్సిగ్గుగా వెనకేసుకుని వస్తున్నారు. ఐదేళ్ల అరాచకపాలనలో మగ్గిపోయిన ప్రజలు అమాయకులు కారు. అప్పుడేం జరిగిందో గుర్తు చేసుకుంటున్నారు. ఐదేళ్లు పెదవి విప్పలేకపోయిన చీకటి రోజులను తలచుకుని సోషల్ అపరిచితులకు అండగా నిలబడుతున్న నాయకులను ఈసడించుకుంటున్నారు.

అవాకులు చెవాకులు.. అబద్ధాలు.. అసభ్యపు మాటలు.. వీడియోలతో చెలరేగిపోయిన సోషల్ కేటుగాళ్లపై జిల్లాలో ఐదేళ్లు చేష్టలుడిగి ఉండిపోయిన పోలీసులు కూటమి ప్రభుత్వంలో కదులుతున్నారు. కేసులు బయటకు తీస్తున్నారు. అరెస్టులు చేస్తున్నారు. జిల్లాలో సోషల్ మీడియా కేంద్రంగా వచ్చిన ఫిర్యాదులు, చర్యల వివరాలు ఇవీ..

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

సోషల్ మీడియాలో అసభ్య పోస్టులను అడ్డుకోని వైసీపీ నేతలు

కూటమి ప్రభుత్వంలో కఠినచర్యలకు శ్రీకారంతో హాహాకారాలు

వేగంగా స్పందిస్తున్న పోలీసు యంత్రాంగం

కదులుతున్న పాత డొంకలు

చంద్రబాబు కుటుంబంపై అసభ్యంగా..

సీఎం చంద్రబాబు, ఆయన కుటుంబ సభ్యుల ఫోటోలు మార్ఫింగ్ చేసి సామాజిక మాధ్యమాల్లో అసభ్యకరంగా పోస్టులు పెడుతున్నారంటూ తిరుపతికి చెందిన తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి పెరుమాళ్ళ మధుబాబు జూలై 23న తిరుపతి ఈస్ట్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన ఈస్ట్ పోలీసులు దర్యాప్తు జరిపి "నారావారి మాధవరెడ్డి" అనే ఐడీ నుంచీ పోస్టులు పెడుతున్నట్టు గుర్తించారు. ఈ పోస్టులు పెడుతున్నది అనంతపురం జిల్లా బెలుగుప్ప మండలం నక్కలపల్లికి చెందిన ఉస్తిలి సంజీవరెడ్డి (42)గా గుర్తించారు. ఈనెల 9న అతనిని అరెస్టు చేశారు. కోర్టు రిమాండు విధించింది. రాజమండ్రి, విశాఖపట్టణం, గుంటూరుల్లో కూడా ఇతనిపై కేసులున్నాయి. దీంతో పీటీ వారెటుపై అతడిని రాజమండ్రి తీసుకెళ్ళారు.

పవన్‌పై పోస్టులు

కూటమి ప్రభుత్వం మీద, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ మీద అభ్యంతరకర పోస్టులు పెడుతున్నారంటూ తిరుపతి నగర జనసేన అధ్యక్షుడు రాజారెడ్డి ఈస్ట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై వైసీపీ సానుభూతిపరుడైన ప్రకాశం జిల్లా కనిగిరికి చెందిన హరీశ్వరరెడ్డిని హైదరాబాదులోని నివాసంలో అదుపులోకి తీసుకున్నారు. ఈకేసుతో సంబంధం వున్న మరికొందరిని కూడా ఇటీవల అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. హరీశ్వరరెడ్డిపై రాష్ట్రంలో పలుచోట్ల కేసులు నమోదై వుండడంతో పీటీ వారెంటుపై రాజమండ్రి పోలీసులు తీసుకెళ్ళారు.

జిల్లావ్యాప్తంగా 13 కేసులు నమోదు

టీటీడీ బోర్డు చైర్మన్ బీఆర్ నాయుడుపై అసభ్యంగా దూషిస్తూ పోస్టు పెట్టిన సినీ ప్రముఖుడు పోసాని కృష్ణమురళిపై సూళ్ళూరుపేట పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు అయింది.

- సోషల్ మీడియాలో అభ్యంతరకర పోస్టుల మీద జిల్లాలో 13 కేసులు నమోదయ్యాయి. సీఎం చంద్రబాబుపై పెట్టిన పోస్టులపై తిరుపతి ఈస్ట్ పోలీస్ స్టేషన్‌లో మూడు, తిరుమల వన్ టౌన్ స్టేషన్‌లో కేసులు నమోదయ్యాయి.
- డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌పై అసభ్య వ్యాఖ్యలకు సంబంధించి తిరుపతి అలిపిరి, ఈస్ట్ పోలీస్ స్టేషన్లలో రెండు కేసులు నమోదు అయ్యాయి.
- శ్రీవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తులను చికాకు పరిచేలా పోస్టులు పెట్టిన శ్రీకాకుళం జిల్లా టెక్కలికి చెందిన దువ్వల మాధురి (38)పై తిరుమల వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు రిజిష్టర్ చేశారు.
- బంగ్లాదేశ్ వరదల వీడియోలు చూపుతూ విజయవాడలో జరిగినట్టు తప్పుడు వీడియోలు పోస్టు చేసిన ప్రకాశం జిల్లా చంద్రశేఖరపురం మండలం అనికలపల్లికి చెందిన హరీశ్వర్‌రెడ్డి మీద తిరుపతి ఈస్ట్ పోలీసులు కేసు పెట్టారు.
- రెండు రాజకీయ పార్టీలు, రెండు కులాల నడుమ ఉద్రిక్తతలు పెంచేలా వీడియోలు పోస్టు చేసి అందులో పోలీసు శాఖపై కూడా అభ్యంతరకర వ్యాఖ్యలు చేసిన శ్రీకాళహస్తి మండలం తొండమనాడుకు చెందిన పోలంరెడ్డి అనే వ్యక్తిపై శ్రీకాళహస్తి రూరల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు అయింది.
- డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, టీటీడీ బోర్డు సభ్యుడు ఆనంద్ సాయి, టీటీడీ బోర్డు చైర్మన్ బీఆర్ నాయుడులపై అసభ్యకరమైన పోస్టులు పెట్టి సర్క్యులేట్ చేసిన వ్యక్తిపై తిరుమల టూ టౌన్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేశారు.
- తిరుమల అన్నదాన సత్రంలో శ్రీవారి అన్న ప్రసాదంలో జెర్రి కనిపించిందంటూ తప్పుడు ప్రచారానికి పాల్పడిన ముగ్గురిపై తిరుమల టూ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.
- తిరుమలలో లడ్డూ కొనుగోలుకు ఆధార్ తప్పనిసరి అని, ఒకరికి ఒక లడ్డూ మాత్రమే ఇస్తారని తప్పుడు ప్రచారం సాగించిన వ్యక్తిపై కూడా తిరుమల వన్ టౌన్ పోలీసులు ఎఫ్ఐఆర్ బుక్ చేశారు.



జగన్‌కు బాసటగా భూమన ఫిర్యాదు

మాజీ సీఎం జగన్ మీద అసభ్యకర పోస్టులు పెడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని తిరుపతి ఈస్ట్ పోలీస్ స్టేషన్‌లో సోమవారం భూమన కరుణాకర్‌రెడ్డి ఫిర్యాదు చేశారు. ఆయన వెంట డిప్యూటీ సీఎం నారాయణస్వామి, మాజీ మంత్రి రోజా, తిరుపతి మేయర్ శిరీష కూడా ఉన్నారు. మంత్రి నారా లోకేశ్ ఆధ్వర్యంలో ఐటీడీపీ విభాగం నుంచీ ఈ పోస్టులు రూపొందించి సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేయిస్తున్నారని వీరు ఫిర్యాదులో పేర్కొన్నారు.

గతం మరచి వైసీపీ నేతల విలాపాలు

ఇపుడు సామాజిక మాధ్యమాల్లో తమ పార్టీ అధినేతకు వ్యతిరేకంగా అసభ్యంగా పోస్టులు పెడుతున్నారంటూ వైసీపీ నేతలు చేస్తున్న విలాపాలకు జనం విస్తుపోతున్నారు. 2019 నుంచీ 2024 జూన్ వరకూ వైసీపీ నేతలు అధికారాన్ని అడ్డుపెట్టుకుని అప్పటి ప్రతిపక్ష నేతలను, మహిళా నాయకులను, వారి కుటుంబీకులను అసభ్యకర పోస్టులు పెట్టి మానసిక క్షోభకు గురి చేసిన విషయాన్ని జనం ఇపుడు గుర్తు చేసుకుంటున్నారు. సామాజిక మాధ్యమాల నియంత్రణకు అప్పుడూ ఇవే చట్టాలు, నిబంధనలు వున్నా చర్యలు ఎందుకు తీసుకోలేదని ప్రశ్నిస్తున్నారు. అప్పట్లో సామాజిక మాధ్యమాల్లో వైసీపీ వ్యక్తులు రెచ్చిపోయి విచ్చలవిడిగా వ్యవహరించిన వైనానికి, బాధితులు ఫిర్యాదు చేసినా పట్టించుకోని పోలీసు తీరుకు మచ్చుకు కొన్ని ఉదాహరణలు....

జనసేన మహిళా నేత అరణ్యరోదన

2022 అక్టోబరు: తిరుపతిలో జనసేన రాష్ట్ర కార్యదర్శి ఆకేపాటి సుభాషిణి జిల్లా ఎస్పీ కార్యాలయంలోని సైబర్ క్రైమ్ సెల్‌కు వెళ్ళి తన ఫోటోలను, తన కోడలి ఫోటోలను వైసీపీకి చెందిన వ్యక్తులు మార్ఫింగ్ చేసి సామాజిక మాధ్యమాల్లో అసభ్యంగా పోస్టు చేసి కామెంట్లు పెడుతున్నారంటూ ఫిర్యాదు చేశారు. సైబర్ క్రైమ్ సెల్ అధికారులు పట్టించుకోకపోవడంతో ఆ పార్టీ నేత కిరణ్ రాయల్ నేరుగా అప్పటి ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్ళారు. అయినా కేసు నమోదు కాలేదు. సుభాషిణికి న్యాయం జరగలేదు.

హైకోర్టు ఆదేశించినా జరగని న్యాయం

2023 డిసెంబరు: తిరుపతి జనసేన నేత కిరణ్ రాయల్ 2023 డిసెంబరులో వైసీపీ వ్యక్తులు తన కుటుంబ సభ్యుల ఫోటోలు మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో అసభ్యంగా పోస్టు చేశారని, వారిపై చర్యలకు పోలీసులను ఆదేశించాలని హైకోర్టును ఆశ్రయించారు. స్పందించిన హైకోర్టు అప్పటి తిరుపతి ఎస్పీ, పుత్తూరు డిఎస్పీ, నగరి సిఐలకు నోటీసులు జారీ చేసింది. కౌంటర్ దాఖలు చేయడంతోపాటు విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. ఇంతవరకూ పోలీసులు కౌంటర్ దాఖలు చేయలేదు. విచారణా జరపలేదు.



పంచాయతీలకు ఊరట

- **జిల్లాకు రూ.29.84 కోట్ల ఆర్థిక సంఘం నిధులు విడుదల**

తిరుపతి (కలెక్టరేట్), నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం పంచాయతీల నిధులను దారి మళ్లించింది. పల్లెసీమల అభివృద్ధిని నీరుగార్చింది. కూటమి ప్రభుత్వం వచ్చాక పంచాయతీల అభివృద్ధిపై దృష్టి పెట్టింది. ఇప్పుడిప్పుడే నిధుల లేమి నుంచి ఊరట పొందుతున్న గ్రామ పంచాయతీలకు మరింత ఉపశమనం లభించనుంది. ఈ క్రమంలో 2024-25 ఆర్థిక సంవత్సరానికి తొలి విడత జిల్లాకు రూ.29.84 కోట్ల 15వ ఆర్థిక సంఘం నిధులను కేంద్ర ప్రభుత్వం విడుదల చేసింది. వీటిలో టైడ్ గ్రాంటు కింద రూ.17,90,96,557, అన్‌టైడ్ గ్రాంటు కింద రూ.11,93,97,710 వెరసి రూ.29,87,94,267 విడుదల అయ్యాయి. జిల్లాలోని 774 పంచాయతీల్లో 29కి ఎన్నికలు జరగలేదు. మిగిలిన 745 పంచాయతీలకు ఈ నిధులను ప్రభుత్వం విడుదల చేసింది. ఈ నిధులను కేంద్ర ప్రభుత్వమే నేరుగా పంచాయతీల ఖాతాలకే కేటాయించనుంది. ఈ నేపథ్యంలో ఆయా పంచాయతీలకు జనాభా నిష్పత్తి ప్రకారం ఎంత మొత్తం వచ్చిందనే సమాచారం పంపే ఏర్పాట్లలో జిల్లా అధికారులు నిమగ్నమయ్యారు. ఈ నిధులను పంచాయతీల్లో మౌలిక వసతుల కల్పన, అభివృద్ధి పనులకు వినియోగించనున్నట్లు డీపీవో సుశీలా దేవి తెలిపారు. కూటమి ప్రభుత్వం వచ్చాక జూన్‌లోనూ రూ.29.50 కోట్ల ఆర్థిక సంఘం నిధులను పంచాయతీలకు కేటాయించిన విషయం తెలిసిందే.

మంచి రోజులే

వైసీపీ ప్రభుత్వ హయాంలో టీడీపీతోపాటు వైసీపీ సానుభూతిపరులైన సర్పంచులు వడ్డీలకు అప్పులు చేసి మరీ ఖర్చు చేశారు. బిల్లులు విడుదలకాక లబోదిబోమనేవారు. నాడు కేంద్ర ప్రభుత్వం నుంచి విడుదలైన 14, 15వ ఆర్థిక సంఘ నిధులను సైతం విద్యుత్ బకాయిల పేరిట 80శాతం మినహాయించుకోవడంతో సర్పంచులు ఇబ్బంది పడ్డారు. ఈ క్రమంలో ప్రస్తుతం పంచాయతీ ఖాతాలకు నిధులు జమవుతుండటంతో సర్పంచులు హర్షం వ్యక్తంచేస్తున్నారు. పల్లెసీమల అభివృద్ధికి ఇక మంచి రోజులు రానున్నాయని అంటున్నారు.

ఏటీఎం కొల్లగొట్టాలని..!
నాయుడుపేటలో చోరీకి యత్నించిన దుండగుడు
అలారం మోగడంతో పరార్
8



డిజిటల్ కాలంలో ఈ బ్లాక్ అండ్ వైట్ ఫోటోలు.. 74 ఏళ్ల కిందటి నేతల్లా.. తలపై తెల్ల టోపీలతో విద్యార్థులు ఫోటోలు దిగడం ఏంటని అనుకుంటున్నారా? మనకు స్వాతంత్ర్యం వచ్చాక దేశానికి

పాఠశాలకూ రాజ్యాంగం

రాజ్యాంగ పరిషత్ ఏర్పాటు చేసి.. రాజ్యాంగాన్ని రూపొందించిన విషయం తెలిసిందే. అదే తరహాలో శ్రీకాళహస్తి మండలంలోని ఊరందూరు జడ్పీ ఉన్నత పాఠశాలకూ రాజ్యాంగం రూపొందించాలని యోచించారు. ఈ మేరకు మంగళవారం రాజ్యాంగ రచన కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాల రాజ్యాంగ పరిషత్‌ను ఏర్పాటు చేసి చైర్‌పర్సన్‌గా ప్రధానోపాధ్యాయురాలు రాజకుమారి.. రచనా సంఘం అధ్యక్షుడిగా సాంఘికశాస్త్ర ఉపాధ్యాయుడు కూనాటి సురేష్ వ్యవహరించారు. హక్కుల కమిటీ, బాధ్యతల కమిటీ, విధివిధానాల కమిటీ తదితర కమిటీలను ఏర్పాటు చేశారు. వాటికి అధ్యక్షులుగా ఉపాధ్యాయులు, సభ్యులుగా విద్యార్థులను నియమించారు. భారత రాజ్యాంగాన్ని పోలి ఉండేలా రూపొందించి.. పాఠశాల అభివృద్ధికి ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. 'పాఠశాల రాజ్యాంగంలో రాజ్యాంగ ప్రవేశికతో పాటు 247 నిబంధనలు, 19 భాగాలు, నాలుగు షెడ్యూళ్లు ఉన్నాయి. 26న రాజ్యాంగ పరిషత్ సమావేశమై ఆమోదిస్తుంది. దీనిని జనవరి 26 నుంచి అమలు చేస్తాం' అని హెచ్‌ఎం రాజకుమారి తెలిపారు. కాగా, భారత రాజ్యాంగం రచనా కాలంలో నేతల వేషధారణతో విద్యార్థులు, టీచర్లు బ్లాక్ అండ్ వైట్ ఫొటో దిగారిలా. ఈ వినూత్న కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.



- శ్రీకాళహస్తి, ఆంధ్రజ్యోతి

తిరుపతి బీసీ స్టడీ సర్కిల్లో డీఎస్సీకి ఉచిత శిక్షణ

- **24వ తేదీ దరఖాస్తు గడువు**

తిరుపతి(విద్య), నవంబరు 19(ఆంధ్రజ్యోతి): తిరుపతి బీసీ స్టడీ సర్కిల్లో డీఎస్సీకి ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు స్టడీ సర్కిల్ సంచాలకుడు చంద్రశేఖర్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈడబ్ల్యుఎస్‌కు చెందిన 220 మంది అభ్యర్థులకు ఉచిత శిక్షణ, ఆ సమయంలో స్టైఫండ్‌తోపాటు స్టడీ మెటీరియల్ కూడా అందజేయనున్నారు. బీఈడీ ఉత్తీర్ణులైన వారికి స్కూల్ అసిస్టెంట్ శిక్షణ, డీఈడీ ఉత్తీర్ణులైన వారికి ఎస్జీటీకి శిక్షణ ఇవ్వనున్నారు. టెట్ క్వాలిఫై అయిన అభ్యర్థులు ఈ ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుచేసుకోవచ్చు. బయోడేటాతో పాటు బీఈడీ ప్రొవిజనల్ సర్టిఫికెట్, 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ మార్కులిస్టులు, కుల, ఆదాయ ధృవీకరణ (తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.లక్ష లోపు మాత్రమే) పత్రాలు, బ్యాంక్ పాస్‌బుక్, 3 పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు జత పరిచి ఈనెల 24వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు తిరుపతి నగరం ముత్యాలరెడ్డిపల్లి, శ్రీకృష్ణా నగర్ మొదటి క్రాస్‌లోని బీసీ స్టడీ సర్కిల్‌లో దరఖాస్తులను అందజేయాలి. మరిన్ని వివరాలకు స్టడీ సర్కిల్లోగాని, 94414 56039, 99850 22254, 93462 21553 నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ఎం-ఫార్మసీ ప్రవేశానికి స్పాట్ అడ్మిషన్లు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూలో ఎం-ఫార్మసీ కోర్సులో ప్రవేశానికి స్పాట్ అడ్మిషన్లు చేపట్టనున్నారు. ఎస్వీయూనివర్సిటీ.డీఓఏ. వెబ్‌సైట్ ద్వారా ఈ నెల 21వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవచ్చు. ఏపీపీజీఈసెట్‌లో ఉత్తీర్ణులైన వారు ఇందుకు అర్హులు. ఏడాదికి ఫీజు రూ.1,28,940గా నిర్ణయించారు. సమగ్ర సమాచారం కోసం అడ్మిషన్ల విభాగం (డీఓఏ) లో సంప్రదించాలని రిజిస్ట్రార్ ప్రొఫెసర్ భూపతి నాయుడు తెలిపారు.

జిల్లాలో పలువురు డీఎల్‌డీవోలకు పోస్టింగులు

- **నెల్లూరుజడ్పీ సీఈవోగా విద్యారమ**



తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 19(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పలువురు డీఎల్‌డీవో(డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్)లను వివిధ జిల్లాలకు బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. శ్రీకాళహస్తిలోని ఈటీసీ(విస్తరణ శిక్షణకేంద్రం) గెజిటెడ్ ఇన్‌స్ట్రక్టర్ విద్యారమను నెల్లూరు జడ్పీ సీఈవోగా బదిలీ చేశారు. అక్కడ పనిచేస్తున్న ఖాదర్‌బాషాను చిత్తూరుజిల్లా నగరి డీఎల్‌డీవోగా నియమించారు. పోస్టింగ్ కోసం వెయిటింగ్‌లో ఉన్న జి.వి.నారాయణరెడ్డిని తిరుపతి డీఎల్‌డీవోగా నియమించారు. చిత్తూరుజిల్లా డ్వామాలో ఫైనాన్షియల్ మేనేజర్‌గా ఉన్న చిన్నరెడ్డెప్పను చంద్రగిరి క్లస్టర్ అసిస్టెంట్ పీడీగా, పూర్వపు జడ్పీ డిప్యూటీ సీఈవోగా పనిచేసిన ఆదిశేషారెడ్డిని కడపజిల్లా డ్వామా పీడీగా నియమించారు.

నేలకొరిగిన భారీ వృక్షం

- **వాహనదారులకు తప్పిన ప్రమాదం**



చంద్రగిరి, నవంబరు 19: తిరుపతి-మదనపల్లె జాతీయ రహదారిలో శ్రీనివాసమంగాపురం సర్కిల్ వద్ద కనకదుర్గమ్మ ఆలయంలో ఏళ్ళనాటి భారీ రావి వృక్షం మంగళవారం సాయంత్రం నేలకొరిగింది. ఇటీవల వర్షాలకు చెట్టు మూలాలు నానిపోయాయి. ఈమార్గం నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉంటుంది. చెట్టు పడిన సమయంలో వాహనాలు లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. కొద్దిసేపు వాహన రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పోలీసులు చేరుకుని గ్రామస్తుల సాయంతో చెట్టు కొమ్మలను తొలగించి, వాహన రాకపోకలను పునరుద్ధరించారు.

రామ్మూర్తి నాయుడి కర్మక్రియలకు ఏర్పాట్లు



ఏర్పాట్ల పరిశీలకు వస్తున్న ఎమ్మెల్యే నాని, టీడీపీ నాయకులు

చంద్రగిరి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే నారా రామ్మూర్తినాయుడు కర్మ క్రియలు ఈనెల 28న నిర్వహించనున్నారు. ఈక్రమంలో నారావారిపల్లెలో వాహనాల పార్కింగ్, భోజన వసతులకు సంబంధించి స్థలాల పరిశుభ్రత పనులు చేపడుతున్నారు. గ్రామస్తులు, టీడీపీ కార్యకర్తలు ఇందులో పాల్గొంటున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య మంత్రి చంద్రబాబునాయుడు, విద్యాశాఖా మంత్రి నారాలోకేష్‌లతో పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, టీడీపీ నేతలు హాజరుకానున్నట్లు సమాచారం. 50 వేల మంది హాజరవుతారని అంచనా. అందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. ఈనేపథ్యంలో మంగళవారం ఎమ్మెల్యే పులివర్తి నాని ఏర్పాట్లును పరిశీలించారు. ఆయన వెంట మండల టీడీపీ అధ్యక్షుడు సుబ్రమణ్యంనాయుడు, తిరుపతి రూరల్ మండల పార్టీ అధ్యక్షుడు ఈశ్వర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.78 కోట్లు

తిరుమల, నవంబరు19(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.78కోట్లు లభించింది.ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ సోమవారం పరకామణి లెక్కింపులు నిర్వహించింది. ఈమేరకు ఆదాయ వివరాలను టీటీడీ మంగళవారం ఉదయం ప్రకటించింది. సోమవారం 62,085 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 21,335 మంది తలనీలాలు సమర్పించారు.

నేడు రాసాని నవలల ఆవిష్కరణ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): రచయిత వీఆర్ రాసాని రాసిన రక్త చందనం, కపిరి నవలల ఆవిష్కరణ సభ బుధవారం ఉదయం 10 గంటలకు ఎస్వీయూ సెనేట్‌హాల్లో జరుగుతుందని మంగళవారం ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ వివేక్ పేర్కొన్నారు.

ఎస్వీయూలో క్రీడాభివృద్ధికి శాప్‌తో ఎంవోయూ



వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడుతో శాప్ ఛైర్మన్ రవి నాయుడు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ యూనివర్సిటీతో శాప్ అవగాహనా ఒప్పందం కుదుర్చుకునేందుకు కసరత్తు ప్రారంభమైంది. ఎస్వీయూ ఇన్‌చార్జి వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతినాయుడుతో శాప్ ఛైర్మన్ రవినాయుడు మంగళవారం సమావేశమయ్యారు. ఎస్వీయూ పరిధిలో క్రీడా సదుపాయాలు మెరుగుపరచడం, నూతన ఆట స్థలం అభివృద్ధికి అవసరమైన నిధుల కోసం ఖేలో ఇండియా ద్వారా నిధులు పొందేందుకు ప్రతిపాదనలు పంపినట్టు రవినాయుడు తెలిపారు. శాప్ పరిధిలోని శ్రీనివాసా క్రీడా సముదాయాన్ని ఆధునీకీకరిస్తామన్నారు. దేశ, రాష్ట్ర స్థాయి క్రీడాకారులకు ఉపయోగపడే స్థాయిలో స్పోర్ట్ కాంప్లెక్స్‌ను తీర్చిదిద్దుతామన్నారు. ఎస్వీయూ వేదికగా రాష్ట్ర స్థాయి సాంస్కృతికోత్సవం నిర్వహించేందుకు సహకారం అందించాలని కోరారు. ఈ కార్యమంలో కల్చరల్ కో-ఆర్డినేటర్ డాక్టర్ పత్తిపాటి వివేక్ చౌదరి, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ డాక్టర్ పాకనాటి హరికృష్ణ యాదవ్, ఇంజినీర్ తాండవకృష్ణ, డీఓపీ డైరెక్టర్ ఊకా రమేష్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలనే ధ్యేయంగా ఇందిర సేవలు



ఇందిరా గాంధీ చిత్రపటానికి అంజలి ఘటిస్తున్న చింతా మోహన్

తిరుపతి(వైద్యం), నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): దేశంలో పేదరిక నిర్మూలనకు మాజీ ప్రధాని ఇందిరా గాంధీ కృషి చేశారని కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత చింతామోహన్ అన్నారు. ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా మంగళవారం ఆయన నివాసంలో కాంగ్రెస్ నేతలతో కలిసి ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాంగ్రెస్ నాయకులు యార్లపల్లి గోపి గౌడ్, వెంకటేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అదేవిధంగా స్థానిక పాత మున్సిపల్ కార్యాలయం సమీపంలోని రాజీవ్‌గాంధీ సర్కిల్ వద్ద మంగళవారం ఇందిరా గాంధీ చిత్రపటాన్ని ఏర్పాటు చేసి కాంగ్రెస్ నేతలతో కలిసి నగర అధ్యక్షుడు గౌడపేరు చిట్టిబాబు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పీసీసీ ఉపాధ్యక్షుడు రాంభూపాల్‌రెడ్డి, కాంగ్రెస్ నేతలు గోపాల్ రెడ్డి, వెంకట నరసింహులు, లోకేష్, మల్లికార్జున్, శివ బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

తిరుపతి (విశ్వవిద్యాలయాలు): ఎస్వీయూలో నిర్వహించిన కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి జెన్నే మల్లికార్జున పాల్గొని ఇందిరాగాంధీ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళి అర్పించారు. కార్యక్రమంలో నాయకులు బాలునాయక్, దేవేంద్ర, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

ఇంటి స్థలాలకు రక్షణ కల్పించండి

తిరుపతి రూరల్, నవంబరు19 (ఆంధ్రజ్యోతి): కేఆర్‌నగర్‌లోని తుడా అప్రూవల్ లేఅవుట్‌లో సర్వేనంబర్లు 249/4,5లలోని తమ ఇళ్ల స్థలాలకు రక్షణ కల్పించాలని పలువురు యజమానులు కోరారు. మంగళవారం వారు మీడియాతో మాట్లాడుతూ 2007లో లేఅవుట్‌లో 22మంది ప్లాట్లను కొని రిజిస్టర్డ్ చేసుకున్నామన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఓ వ్యక్తి రాజకీయ పలుకుబడి ఉందంటూ అధికార ప్రతినిధి పేరుచెప్పి తమ స్థలాల్లో నిర్మాణాలు చేపట్టేందుకు ప్రయత్నించారన్నారు. ఇప్పుడూ అదేతీరు కొనసాగిస్తున్నాడన్నారు. తమ స్థలాలకు. జిల్లా ఎస్పీ చర్యలు చేపట్టాలని కోరారు. వి.ఉషారాణి, కె.జయరామ్‌నాయుడు, ఎ.దశరథరాములు, పి.నిర్మల, మోహన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ ఉపాధ్యక్షుడిగా కేఎంకే లోకేష్



తిరుపతి(లీలామహల్), నవంబరు 19(ఆంధ్రజ్యోతి: లయన్స్‌క్లబ్ శ్రీశ్రీనివాస ఉపాధ్యక్షుడిగా తిరుమలకు చెందిన కేఎంకే లోకేష్ ఎన్నికయ్యారు. మంగళవారం తిరుమల బైపాస్ రోడ్డులోని ఓహోటల్‌లో లయన్స్ ఇంటర్నేషనల్ ప్రతినిధుల ఆధ్వర్యంలో ఎన్నికలు జరిగాయి. ఆయన మాట్లాడుతూ ఉపాధ్యక్షుడిగా తనను ఎన్నుకున్న అధ్యక్షుడు ఆర్కాట్ కృష్ణప్రసాద్‌కు, కార్యవర్గ సభ్యులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

ఎస్వీయూ ఎన్ఎంఆర్‌లకు జీతం పెంపు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ యూనివర్సిటీలోని ఎన్ఎంఆర్, డైలీ వేజ్ ఉద్యోగులకు వేతనాలను పెంచుతూ అధికారులు నిర్ణయించారు. పెరిగిన వేతనం 2024 ఏప్రిల్ నుంచి అమల్లోకి రానుంది. ఇక్కడ పని చేస్తున్న ఉద్యోగులకు కనీస వేతనం అందేలా చూడాలంటూ యూనివర్సిటీ అధికారులకు ఇటీవల కలెక్టర్ సూచించారు. ఈమేరకు ఇన్‌చార్జి వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు ఒక్కో ఉద్యోగికి నెలకు రూ.1000 పెంచుతూ నిర్ణయం తీసుకోవడంతో పాటు అధికారిక ఉత్తర్వులను కూడా వెలువరించారు. గత ఏడు నెలలకు చెందిన అరియర్స్ కూడా చెల్లించాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. దీనిపై యూనివర్సిటీలోని ఎన్ఎంఆర్, డైలీ వేజ్ ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వేతనాలు పెంచిన ఉన్నతాధికారులకు వారు కృతజ్ఞతలు తెలియజేశారు.

మద్యం విక్రేత అరెస్టు : 38 బాటిళ్లు సీజ్

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 19(ఆంధ్రజ్యోతి): అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఒక వ్యక్తిని మంగళవారం తిరుపతి రూరల్ ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేసినట్లు రూరల్ ఎక్సైజ్ సీఐ నరస నాయుడు మంగళవారం తెలిపారు. తిరుపతి అర్బన్ మండలం క్రాంతినగర్‌కు చెందిన రవీంద్రారెడ్డి కొంత కాలంగా మద్యం దుకాణాల నుంచి మద్యం బాటిళ్లు తీసుకెళ్లి గ్రామాల్లో అధిక ధరకు విక్రయిస్తున్నాడన్నారు. దీనిపై అందిన సమాచారంతో ఎస్ఐలు కవీశ్వర నాయుడు, అంజలి ప్రసన్న, సిబ్బంది దాడుల్లో రవీంద్రారెడ్డి పట్టుబడినట్లు తెలిపారు. అతడిని అరెస్టు చేసి 38 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు.

ఉపాధ్యాయులకు వృత్యంతర శిక్షణ



శిక్షకులతో డీఈవో కేవీఎస్ కుమార్

తిరుపతి(విద్య), నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రయోగాంశాలతో కూడిన బోధన ద్వారానే విద్యార్థులకు జ్ఞానం ఒనగూరుతుందని డీఈవో కేవీఎస్‌కుమార్ చెప్పారు. అగస్త్య ఇంటర్నేషనల్ ఫౌండేషన్ (తడ) ఆధ్వర్యంలో జీవశాస్త్ర ఉపాధ్యాయులకు తిరుపతిలో మంగళవారం వృత్యంతర శిక్షణ ఇచ్చారు. స్థానిక టీపీపీఎం పాఠశాలలో జరిగిన ఈ శిక్షణ కార్యక్రమాన్ని డీఈవో ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రయోగాలకు ప్రాముఖ్యతనిస్తూ విద్యార్థులకు బోధించాలన్నారు. జిల్లా సైన్స్ అధికారి భానుప్రసాద్ మాట్లాడుతూ లాభాపేక్ష లేకుండా అగస్త్య ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ఉపాధ్యాయులకు వృత్యంతర శిక్షణను అందిస్తోందంటూ భవిష్యత్తులో శిక్షణ కార్యక్రమాలను మరింత విస్తృతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఫౌండేషన్ కోఆర్డినేటర్ గాజుల మోహన్, సుమన్, పోలమ్మ, నీరజ ఉపాధ్యాయులకు వివిధ ప్రయోగాంశాలతో శిక్షణ ఇచ్చారు. టీపీపీఎం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆనంద్‌కుమార్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న 'శ్రీకృష్ణరాయబారం'



కళాకారులను సన్మానిస్తున్న నిర్వాహకులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణరాయబారం పౌరాణిక నాటక ప్రదర్శన ఆహూతులను ఆద్యంతమూ ఆకట్టుకుంది. నాలుగు రోజులుగా తిరుపతిలోని మహతి ఆడిటోరియంలో పద్మనాభ నేషనల్ అకాడమీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ అకాడమీ వార్షికోత్సవ సంబరాలు మంగళవారం ముగిశాయి. టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్, ఆంధ్రప్రదేశ్ నాటక అకాడమీ సంయుక్త సహకారంతో వీటిని నిర్వహించారు. ఇందులో భాగంగా మంగళవారం సాయంత్రం శ్రీకృష్ణరాయబారం నాటకాన్ని వాసుదేవ నాటక కళా మండలి(తిరుపతి) ప్రదర్శించింది. కళాకారులు ఆలపించిన పద్యాలు ఆకట్టుకున్నాయి. కళాకారులను నిర్వాహకులు పద్మనాభం శాలువా, పుష్పగుచ్ఛం, జ్ఞాపికతో సత్కరించారు. కార్యక్రమంలో కస్మా సామ్రాజ్యం, ప్రొఫెసర్ గార్లపాటి దామోదర నాయుడు, కళాదీపిక ఎడిటర్ రాఘవాచారి, కళాకారులు గజేంద్ర, మోహన్‌రెడ్డి, భాగవతుల జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శివపార్వతులకు పూలంగి సేవ



చంద్రగిరి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): తొండవాడలోని అగస్త్యేశ్వరాలయంలో రుద్రపాదాల ముక్కోటి ఉత్సవాల్లో మంగళవారం శివపార్వతులకు పూలంగి సేవను వైభవంగా నిర్వహించారు. అంతకుముందు ఉదయం ఉత్సవమూర్తులు నంది వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. 10 గంటలకు వివిధ రకాల సుగంధ బరితమైన పుష్పాలతో పూలంగిసేవ నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మద్యాహ్నం అన్నదానం చేశారు. రాత్రి రావణాసుర వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ధర్మకర్త మొగిలి రఘునాథరెడ్డి, భక్తులు పాల్గొన్నారు. చంద్రగిరిమల్లేశ్వరాలయంలో అంగారక సంకటహర చతుర్థి సందర్భంగా అభిషేకం చేశారు.శైవాంగ పండితులు శివకుమార్‌శర్మ పాల్గొన్నారు.

యువత నైపుణ్యాలను అందిపుచ్చుకోవాలి



నియామక పత్రాలను చూపుతున్న అభ్యర్థులు

తిరుపతి (లీలామహల్), నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత జాబ్ మార్కెట్ అవసరాలకు అనుగుణంగా యువత నైపుణ్యాలను అందిపుచ్చుకోవాలని డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు పేర్కొన్నారు. సీడాప్ - డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో మంగళవారం టీటీడీసీ ప్రాంగణంలో ఫ్యూజన్ ఫైనాన్స్ లిమిటెడ్ కంపెనీలో రిలేషన్ ఆఫీసర్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు జరిగాయి. ఈ ఇంటర్వ్యూల్లో 16 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు తెలిపారు. కార్యక్రమంలో సీడాప్ జేడీ ఎం.సరితారెడ్డి, అనిల్, సీడాప్ సిబ్బంది, యుగంధర్‌బాబు, కృష్ణయ్య, ధనంజయ తదితరులు పాల్గొన్నారు.

11న అన్నమయ్య కళాక్షేత్రం శోభాయాత్ర

తిరుపతి(ఆటోనగర్), నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): గ్రామస్థాయి నుంచి భజన కార్యక్రమాలను టీటీడీ ప్రోత్సహించి భక్తి భావాలను పెంపొందించాలని అన్నమయ్య కళాక్షేత్రం పీఠాధిపతి స్వామి విజయశంకర్ అన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ గీతా జయంతి సందర్భంగా డిసెంబరు 11న అన్నమయ్య కళాక్షేత్రం ఆధ్వర్యంలో నగరంలో శోభాయాత్ర నిర్వహించనున్నట్లు తెలిపారు. తిరుమలలో అన్నమయ్య విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో కళాక్షేత్రం సభ్యులు పాల్గొన్నారు.

టీటీడీ బోర్డు నిర్ణయాలు అభినందనీయం : కిరణ్

తిరుపతి(ఆటోనగర్), నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): టీటీడీ పాలక మండలి తీసుకున్న పలు నిర్ణయాలు అభినందనీయమని, హర్షణీయమని తిరుపతి జనసేన పార్టీ నేత కిరణ్ రాయల్ అన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ తమ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఎన్నికల ముందు తిరుపతి ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు స్థానికులకు మంగళవారం దర్శనం కల్పించడం అభినందనీయమన్నారు. పాలక మండలిలో తీసుకున్న నిర్ణయాలన్నీ ప్రజలు, భక్తులు హర్షించదగినవన్నారు. ప్రభుత్వానికి, టీటీడీకి జనసేన వారధిగా ఉంటుందని వెల్లడించారు.

25న కార్తీక కోటి దీపోత్సవం

తిరుపతి(ఆటోనగర్), నవంబరు 19(ఆంధ్రజ్యోతి): తిరుపతి ఫిలిం సొసైటీ ఆధ్వర్యంలో ఈనెల 25వ తేదీ సాయంత్రం స్థానిక రామచంద్ర పుష్కరణి ప్రాంగణంలో కార్తీక కోటి దీపోత్సవ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సొసైటీ ఛైర్మన్ ఎం.వేణుగోపాల్ రెడ్డి, అధ్యక్షుడు వైఎస్ బాబు వెల్లడించారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో వారు మీడియాతో మాట్లాడుతూ సోమవారం ఉదయం 10 గంటలకు పుష్పాలంకరణ, మధ్యాహ్నం 3 గంటలకు శ్రీకృష్ణదాసు బృందంచే శివనామ సంకీర్తనలు, సాయంత్రం 5 గంటలకు ప్రముఖులచే ప్రవచన కార్యక్రమాలు ఉంటాయన్నారు. అనంతరం దీపోత్సవ కార్యక్రమం ప్రారంభమవుతుందని వారు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

తిరుపతి(ఆటోనగర్),నవంబరు19(ఆంధ్రజ్యోతి): తిరుపతి విద్యుత్ టౌన్ డివిజన్‌లోని బాలాజీ కాలనీ 33-11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11కేవి, ఎల్‌టీ విద్యుత్ లైన్ల మరమ్మతులు, కొమ్మలు తొలగించడం వంటి కార్యక్రమాన్ని చేపడుతున్న కారణంగా మంగళవారం 9గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని టౌన్ ఈఈ వి.చంద్రశేఖరరావు ఒక ప్రకటలో తెలిపారు. ఎల్ఐసి రోడ్డు, నెహ్రూనగర్, బొమ్మగుంట, కేవీ లేఅవుట్, ఐఎస్ మహల్ రోడ్డు, రిజర్వాయర్ రోడ్డుతో పాటు సమీపప్రాంతాల్లో విద్యుత్ సరఫరా అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

టీడీపీ నేతపై మరో కేసు

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 19(ఆంధ్రజ్యోతి): తిరుపతికి చెందిన టీడీపీ నేత జేబీ శ్రీనివాస్‌పై మంగళవారం తిరుపతి రూరల్ స్టేషన్‌లో మరో కేసు నమోదైంది. దీనికి సంబంధించి సీఐ చిన్నగోవిందు కథనం మేరకు....తిరుపతి రూరల్ మండలం తిరుచానూరు పంచాయతీ లెక్కదాఖలా సర్వే నెంబరు 250-2లో తమ భూమిని శ్రీనివాస్ తప్పుడు డాక్యుమెంట్లతో ఆక్రమించుకునేందుకు ప్రయత్నించాడని రంగంపేటకు చెందిన మునిరాజమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. గతనెల 23న రౌడీమూకలతో కలసి మారణాయుధాలు పట్టుకుని భూమిని ఆక్రమించడానికి ప్రయత్నించారని, దాడికి పాల్పడ్డారని ఆమె పేర్కొంది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 19(ఆంధ్రజ్యోతి):గుర్తుతెలియని వాహనం ఢీకొని యువకుడు మృతి చెందాడు. రూరల్ సీఐ చిన్నగోవిందు కథనం మేరకు... చంద్రగిరి కొత్తపేటకు చెందిన ఉదయ్‌కుమార్ (27) స్థానికంగా కూరగాయల వ్యాపారం చేస్తున్నాడు. మంగళవారం వ్యాపార పనిపై తిరుపతి రూరల్ పరిధిలోని చిగురువాడ రోడ్డుపై నడచి వెళుతుండగా వెనుక నుంచి గుర్తుతెలియని కారు ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు.

ప్రైవేట్ జూనియర్ కళాశాలల సంఘం కార్యవర్గం ఎంపిక



కమలాకర్ - నీరజాక్షులు నాయుడు

తిరుపతి(విద్య), నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రైవేట్ జూనియర్ కళాశాలల అసోసియేషన్ కార్యవర్గం ఎంపిక మంగళవారం తిరుపతిలో జరిగింది. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా తిరుపతి తాటితోపులోని భూపాల్ జూనియర్ కళాశాల అధ్యాపకులు కమలాకర్, కార్యదర్శిగా తిరుపతి శ్రీగాయత్రి జూనియర్ కళాశాల అధ్యాపకులు నీరజాక్షులు నాయుడు, కోశాధికారిగా పేరూరులోని మెరిటోరియస్ జూనియర్ కళాశాల అధ్యాపకులు శేఖరరెడ్డి ఎంపికయ్యారు. అలాగే ఉపాధ్యక్షుడిగా సురేంద్రరాజు, నగరి, సత్యవేడు, సూళ్లూరుపేట, నాయుడుపేట, శ్రీకాళహస్తి ప్రాంతాలకు చెందిన ఒక్కొక్కరిని ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా ఎంపిక చేశారు.

విద్యాశాఖలో మార్పులపై టీచర్లకు శిక్షణ

చంద్రగిరి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): తొండవాడ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులకు శిక్షణా కార్యక్రమం జరిగింది. జిల్లా అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ శివశంకరయ్య హాజరై విద్యాశాఖలో తీసుకువస్తున్న పలు రకాల కార్యక్రమాలపై సమగ్ర అవగాహన కల్పించారు. శిక్షణాంశాలతో విద్యార్థుల విద్యాభివృద్ధికి కృషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవోలు లలితకుమారి, భాస్కర్‌బాబు, రిసోర్స్ పర్సన్లు రామకృష్ణారెడ్డి, చంద్రశేఖర్, మండలంలోని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పంచాయతీల్లో ఎంపీడీవో తనిఖీలు

తిరుపతి రూరల్, నవంబరు19(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు పంచాయతీలను ఎంపీడీవో రామచంద్ర మంగళవారం తనిఖీ చేశారు. పెరుమాళ్లపల్లె, ఎస్వీనగర్, పుదిపట్ల, చెర్లోపల్లె, వేంకటపతినగర్‌లోని సచివాలయాను సందర్శించి రికార్డులను పరిశీలించారు. గ్రామాల్లో చేపడుతున్న హౌస్‌హోల్డ్ జియోట్యాగింగ్, ఎన్‌పీసీఐ సర్వేల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పెరుమాళ్లపల్లెలోని ఎంపీపీస్కూల్‌ని సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు.

గౌడ్ కార్పొరేషన్ సభ్యుడిగా చెంగయ్య



చంద్రగిరి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): గౌడ కార్పొరేషన్ సభ్యునిగా తిరుపతి రూరల్ మండలం పెరుమాళ్ళపల్లి పంచాయతీ ఎస్వీనగర్‌కు చెందిన తుమ్మల చెంగయ్య నియమితులయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తన సేవలను గుర్తించి పదవి ఇచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు, ఎమ్మెల్యే పులివర్తి నాని, మండల టీడీపీ అధ్యక్షుడు ఈశ్వర్‌రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు.

పులికంటికి ఘన నివాళి

తిరుపతి(విశ్వవిద్యాలయాలు), నవంబరు 19(ఆంధ్రజ్యోతి): తిరుపతికి చెందిన ప్రముఖ కథారచయిత, కవి, రంగస్థల నటుడు, దివంగత పులికంటి కృష్ణారెడ్డి సేవలు మరువలేనివని పలువురు కళాకారులు నివాళులర్పించారు. మంగళవారం రాయలసీమ రంగస్థలి సభ్యులు రాయలసీమ చిన్నోడుగా పేరుగాంచిన కృష్ణారెడ్డి వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో గుండాల గోపీనాథ రెడ్డి, కేఎన్ రాజ, సుబ్రహ్మణ్యం యాదవ్, పొన్నాల జేజిరెడ్డి, కప్పా పద్మనాభం, మురళి, వాసు, రాధాకృష్ణారెడ్డి, సుబ్రహ్మణ్యంరెడ్డి పాల్గొన్నారు.

22న మహిళల ఆరోగ్యంపై సదస్సు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మహిళల ఆరోగ్యంపై ఈనెల 22న ఎస్వీ యూనివర్సిటీలో సదస్సు నిర్వహించనున్నారు. మధ్యాహ్నం 2గంటలకు శ్రీనివాసా ఆడిటోరియంలో సదస్సు ప్రారంభం కానుంది. ఇందుకు సంబంధించిన బ్రోచర్‌ను ఇన్‌చార్జి వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు ఆవిష్కరించారు.

విశ్వం విద్యాసంస్థలకు అవార్డు



ఆదాశర్మ నుంచి అవార్డు అందుకుంటున్న విశ్వచందన్‌రెడ్డి

తిరుపతి(విద్య), నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): తిరుపతి విశ్వం విద్యాసంస్థలకు 'ఇండియాస్ మోస్ట్ ట్రస్టెడ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ది ఇయర్' అవార్డు లభించింది. బెంగళూరుకు చెందిన షై బ్రాండ్ బెటర్ సంస్థ ఏటా ఈ అవార్డులను ప్రదానం చేస్తోంది. మంగళవారం బెంగళూరులో జరిగిన కార్యక్రమంలో విశ్వ అకడమిక్ డైరెక్టర్ ఎన్.వి.విశ్వచందన్‌రెడ్డి బాలీవుడ్ నటి ఆదాశర్మ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు.

ఆచార్య గణేష్ ప్రసాద్ భట్‌కు విశిష్ట విద్వత్ సమ్మాన్ పురస్కారం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): వేద విశ్వవిద్యాలయ రుగ్వేద విభాగ ఆచార్యులు గణేష్ ప్రసాద్ భట్ విశిష్ట విద్వంత్ సమ్మాన్ పురస్కారం పొందారు. రుగ్వేద బోధన, పరిశోధన, విస్తరణ రంగాల్లో ఈయన చేసిన కృషికి గుర్తింపుగా హరిద్వార్‌లో తాజాగా నిర్వహించిన అఖిల భారతీయ వైదిక సమ్మేళనంలో పురస్కారాన్ని ప్రదానం చేశారు.

ప్రసూతి ఆస్పత్రి ఆవరణలో ఆటోడ్రైవర్ ఆత్మహత్య

తిరుపతి(వైద్యం), నవంబరు 19(ఆంధ్రజ్యోతి): అప్పుల బాధతో ఆటో డ్రైవర్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తిరుపతి ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి ఆవరణలో ఏపీఎంఐడీసీ మార్గంలో చెట్టుకు ఓ వ్యక్తి ఉరి వేసుకుని ఉండటాన్ని రోగుల సహాయకులు మంగళవారం అర్ధరాత్రి గుర్తించారు. ఆసుపత్రి సెక్యూరిటీ సిబ్బంది వెంటనే విషయాన్ని వెస్ట్ పోలీసులకు తెలియజేశారు. పోలీసులు అక్కడికి చేరుకుని పరిశీలించారు. ఆత్మహత్యకు పాల్పడిన యువకుడి జేబులో ఒక లెటర్ కనిపించింది. అందులోని వివరాల ప్రకారం మృతుడి పేరు మునిబాబు (35)గా గుర్తించారు. అప్పుల బాధతోనే ఆత్మహత్యకు పాల్పడుతున్నట్టు మృతుడు ఆ ఉత్తరంలో పేర్కొన్నాడని పోలీసులు తెలిపారు.

హామీ నెరవేర్చిన పాలకులకు పాలాభిషేకం



తిరుపతి అర్బన్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ప్రతినెల స్థానికులకు శ్రీవారి దర్శనం కల్పిస్తామని ఎన్నికల ముందు ఇచ్చిన హామీ నెరవేర్చిన సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసుల చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. జనసేన పట్టణాధ్యక్షుడు రాజారెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం నాలుగుకాళ్ల మండపం వద్ద ఎన్నికల హామీని గుర్తుచేసుకుంటూ ఈ కార్యక్రమం వేడుకగా జరిగింది. కూటమి ప్రభుత్వం వర్ధిల్లాలని నినాదాలు చేశారు. జనసేన నాయకులు హరిశంకర్, వినోద్‌రాయల్, నారాయణ, మదుబాబు, ఆర్కాట్ కృష్ణప్రసాద్, బాబ్జి, రాజేష్‌ఆచారి, సుభాషిణి, సునీల్‌చక్రవర్తి, అశోక్, మునస్వామి, లోకేశ్, హేమంత్, తదితరులు పాల్గొన్నారు.

సంకటహర చతుర్దశి వేడుకలు

తిరుపతి (జీవకోన), నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): తిరుపతి నగర పరిధిలోని వినాయకసాగర్ వద్ద ఉన్న సంకల్ప వరసిద్ధి వినాయకస్వామి ఆలయంలో మంగళవారం సంకటహర చతుర్దశి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ధర్మకర్త చెంగారెడ్డి, సభ్యులు గుండాల గోపీనాథ్‌రెడ్డి, సుబ్రహ్మణ్యంరెడ్డి, నాదమునిరెడ్డి, ఆనంద్, తిరుమలయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రుద్రయాగం



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కపిలతీర్థంలో జరుగుతున్న కార్తీక మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం కపిలేశ్వర స్వామివారి హోమం (రుద్ర యాగం) ప్రారంభమైంది. యాగశాలలో ఉదయం పూజ, రుద్రజపం, హోమం, లఘుపూర్ణాహుతి, నివేదన, హారతి నిర్వహించారు. అదేవిధంగా ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు లక్ష బిల్వార్చన జరిగింది. సాయంత్రం స్వామి, అమ్మవార్లకు సాయంత్ర పూజ, జపం, హోమం, రుద్రత్రిశతి, బిల్వార్చన, నివేదన, విశేష దీపారాధన, హారతి జరిగింది. అర్చక స్వాములు, ఆలయ సిబ్బంది, డిప్యూటీ ఈవో దేవేంద్రబాబు, భక్తులు పాల్గొన్నారు.

మహిళలు పురుషులతో సమానంగా ఎదగాలి


మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీలత

తిరుపతి (లీలామహల్), నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): సమాజంలో మహిళలు పురుషులతో సమానంగా ఎదగాలని, పోటీ సమాజంలో ఆదర్శంగా నిలవాలని తిరుపతి మహిళా డీఎస్పీ శ్రీలత పేర్కొన్నారు. మంగళవారం అన్నమయ్య కూడలిలోని శాఖా గ్రంథాలయంలో జరిగిన 57వ గ్రంథాలయ వారోత్సవాల్లో ఆమె పాల్గొని మాట్లాడుతూ యువతీ, యువకులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని కష్టపడాలన్నారు. పుస్తక పఠనంతో మేథోసంపద పెరుగుతుందని, తిరుపతి గ్రేడ్-1 గ్రంథాలయంలో అన్ని రకాల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ముందుగా ఝాన్సీ లక్ష్మీబాయి జయంతి సందర్భంగా మహిళా దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి శివప్రసాద్, ప్రసన్న, తిరుపతి, రాధ, తహసున్నీసబేగం, మునిలక్ష్మి, రజని, సుజాత, కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

మహిళలు పింక్ టాయిలెట్లు వినియోగించుకోవాలి


అవగాహన కల్పిస్తున్న కమిషనర్ మౌర్య

తిరుపతి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మహిళల కోసం ఏర్పాటు చేసిన పింక్ టాయిలెట్లను మహిళలు వినియోగించుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య పిలుపునిచ్చారు. ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవం (వరల్డ్ టాయిలెట్స్ డే) సందర్భంగా నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన పింక్ టాయ్‌లెట్లు, శ్రీనివాసం వద్ద ఉన్న మరుగుదొడ్లను మంగళవారం కమిషనర్ పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ నగరంలో ఉన్న అన్ని మరుగుదొడ్లను శుభ్రంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు. డీసీ అమరయ్య, ఎంహెచ్‌వో డాక్టర్ యువ అన్వేష్, శానిటరీ సూపర్ వైజర్ సుమతి పాల్గొన్నారు.

జాతీయ నవజాత శిశు వారోత్సవాల ర్యాలీ

తిరుపతి(వైద్యం), నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): రుయాసుపత్రి ఆవరణలో మంగళవారం జాతీయ నవజాత శిశు వారోత్సవాల ర్యాలీ జరిగింది. ఎస్వీ వైద్య కళాశాల చిన్నపిల్లల విభాగం ఆధ్వర్యంలో జరిగిన ర్యాలీని రుయా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రవిప్రభు ప్రారంభించారు. చిన్నపిల్లల విభాగాధిపతి డాక్టర్ మనోహర్ ఆధ్వర్యంలో వైద్య విద్యార్థులు, నర్సింగ్, ఫార్మశీ విద్యార్థులతో భారీగా ర్యాలీలో పాల్గొన్నారు. కార్యక్రమాల్లో చిన్నపిల్లల ప్రొఫెసర్ డాక్టర్ కిరీటి, డాక్టర్ అంజన్ కుమార్, చిన్నపిల్లల విభాగ వైద్యాధికారులు తదితరులు పాల్గొన్నారు.



వీధిలో వరినాట్లు

ఈ మహిళలు వరినాట్లు వేసేది పొలంలో కాదు.. వీధిలో. వర్షపు నీటితో తమ ఇళ్ల మధ్యలో ఉన్న వీధి మడుగులా మారింది. దీనికి మట్టి తోలించడంలో పాలకుల నిర్లక్ష్యానికి నిరసనగా ఇలా వరినాట్లు వేశారు. ఈ ఘటన మంగళవారం దొరవారిసత్రం మండలం కల్లూరులో జరిగింది. ఏళ్ల తరబడి మడుగులా ఉన్న తమ వీధికి మట్టి తోలమని పంచాయతీ పాలకులకు, అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోలేదని స్థానికులు ఆవేదన వ్యక్తంచేశారు.

- దొరవారిసత్రం, ఆంధ్రజ్యోతి

నడుములు విరగతాయ్!

ఈ రోడ్డున వెళ్లేటప్పుడు ఏమాత్రం ఆదమరిచినా నడుములు విరగాల్సిందే. చంద్రగిరి-అనుప్పల్లె మార్గంలో మల్లయ్యపల్లె మలుపు వద్ద ఉన్న గుంతకు ఇటీవల అధికారులు తాత్కాలికంగా మట్టి పోశారు. వర్షాలకు మళ్లీ యథాస్థితికి చేరింది. ఇటీవల ద్విచక్ర వాహనదారుడు నడిరోడ్డుపై ఉన్న ఈ గుంతను చివర్లో చూసి అదుపు చేయలేక కింద పడటంతో తీవ్ర గాయాలయ్యాయి. గత వైసీపీ ప్రభుత్వం రోడ్లను గాలికి వదిలేయడంతో ఈ దుస్థితి ఏర్పడింది. కూటమి ప్రభుత్వంలోనైనా మరమ్మతులు చేయాలని ప్రయాణికులు కోరుకుంటున్నారు.

- చంద్రగిరి, ఆంధ్రజ్యోతి





మల్లయ్యపల్లె వద్ద అదుపు తప్పి గాయపడిన ప్రయాణికుడు

అలారం మోగింది.. దొంగ పరారయ్యాడు



● నాయుడుపేటలో ఏటీఎం చోరీకి విఫలయత్నం

నాయుడుపేట టౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): గునపం తెచ్చాడు. ఏటీఎంను పగలగొట్టే ప్రయత్నం చేశాడు. ఇంతలో అలారం మోగడంతో.. దొంగ పరారయ్యాడు. లేదంటే ఏటీఎంలో నగదు అపహరించుకుని వెళ్లేవాడేమో? ఈ ఘటన మంగళవారం తెల్లవారుజామున నాయుడుపేట బైపాస్ రోడ్డులో చోటుచేసుకుంది.

నాయుడుపేట- శ్రీకాళహస్తి బైపాస్‌రోడ్డు సమీపంలో యాక్సెస్ బ్యాంకు ముందు గదిలో ఏటీఎం ఏర్పాటు చేశారు. సోమవారం సాయంత్రం బ్యాంకు సిబ్బంది విధులను ముగించుకొని బ్యాంక్ షట్టర్ మూసేసి వెళ్లారు. అయితే ఏటీఎం గది మాత్రం తెరిచే ఉంటుంది. ఈ క్రమంలో మంగళవారం తెల్లవారుజామున ఓ దుండగుడు మోటారు సైకిల్‌పై గునపంతో వచ్చాడక్కడకు. బ్యాంక్ ముందు మోటారు సైకిల్‌ను పెట్టాడు. ముఖానికి ప్లాస్టిక్ కవర్‌ను చుట్టుకొని, గునపం తీసుకుని ఏటీఎంలోకి వచ్చాడు. గునపంతో ఏటీఎం ముందు డోర్‌ను తొలగించాడు. అదే సమయంలో అలారం మోగింది. ఆ సమాచారం బ్యాంక్ హెడ్ ఆఫీసుకు వెళ్లింది. అక్కడ నుంచి నాయుడుపేట బ్యాంక్ మేనేజర్‌కు తమ ఏటీఎం వద్ద చోరీ జరుగుతున్నట్లు సమాచారం అందించారు. తక్షణమే బ్యాంక్ మేనేజర్.. అర్బన్ సీఐ బాబికి సమాచారం ఇచ్చారు. అదే సమయంలో రాత్రి గస్తీలో ఉన్న సీఐ.. హుటాహుటిన ఏటీఎం వద్దకు చేరుకున్నారు. అప్పటికే ఆ దుండగుడు పరారయ్యాడు. ఏటీఎంలో ఉన్న నగదు మాత్రం చోరీకి గురికాలేదని సీఐ వెల్లడించారు.



ఏటీఎం డోర్‌ను గునపంతో కొడుతున్న దుండగుడు

సీసీ కెమెరాల్లో దుండగుడు

మోటారు సైకిల్‌పై ఏటీఎం దగ్గరకు చేరుకొని తిరిగి బ్యాంక్ ఎదురుగా ఉన్న వీధిలోకి దుండగుడు ప్రవేశించిన సన్నివేశాలు సీసీ కెమెరాలలో నమోదయ్యాయి. అయితే ఎదురుగా వీధిలోకి ప్రవేశించిన తరువాత ఓ విశ్రాంత ఉపాధ్యాయుడి ఇంటి వద్ద ఉన్న కెమెరాలో మాత్రం వీధిలోకి వెళ్తున్నది కనిపించింది. ఆ తర్వాత కెమెరాలు లేకపోవడంతో దుండగుడు ఎలా వెళ్లాడనేది అంతుపట్టడం లేదు. యాక్సెస్ బ్యాంక్ ఏటీఎం వద్ద రాత్రి సమయంలో సెక్యూరిటీ లేదని తెలిసి చోరీకి యత్నించినట్లు తెలుస్తోంది. ఇక, క్లూస్ టీమ్ ఎస్ఐ దస్తగిరి సంఘటనాస్థలికి చేరుకొని వేలిముద్రలు సేకరించారు.

రద్దీ ప్రాంతంలో..

నాయుడుపేట- శ్రీకాళహస్తి బైపాస్‌రోడ్డు పక్కనే యాక్సెస్ బ్యాంకు ఏటీఎం ఉంది. రాత్రి వేళల్లో ఎప్పుడూ తిరుపతికి వెళ్లే బస్సులు, ఇతర వాహనాలతో ఆ రోడ్డు రద్దీగా ఉంటుంది. పోలీస్ గస్తీ కూడా అదే రహదారిలో ఉంటుంది. అయినా దుండగుడు గునపం తీసుకొని మోటారు సైకిల్‌పై వచ్చి చోరీకి యత్నించడం స్థానికులను ఆశ్చర్యానికి గురిచేసింది.



చోరీకి యత్నించిన ఏటీఎం వద్ద వేలిముద్రలు సేకరిస్తున్న క్లూస్ టీమ్

● సమీక్షలు - సమావేశాలు

సౌర విద్యుత్ ఉత్పత్తిపై అవగాహన కల్పించండి



సీఎం సూర్యఘర్ యోజన పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్, ఇతర అధికారులు

● అధికారులకు కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశం

తిరుపతి (కలెక్టరేట్), నవంబరు 19(ఆంధ్రజ్యోతి): సౌర విద్యుత్ వినియోగంపై ప్రజల్లో అవగాహన కల్పించాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం రాత్రి విద్యుత్ ఉత్పత్తి, వినియోగంపై ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈ, నెడ్‌క్యాప్ డెవలప్‌మెంట్ మేనేజర్‌తో కలిసి ఆయన జిల్లాస్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. జిల్లాలో పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజిలి పథకాన్ని అమలు పరచడానికి 10 మంది సభ్యులతో కూడిన కమిటీని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ పథకం ద్వారా గృహ వినియోగదారులు తమ ఇంటిపైభాగంలో సౌర విద్యుత్ తయారు చేసుకుని వినియోగించుకోవచ్చన్నారు. దీనికి ప్రోత్సాహంగా ఒక కిలోవాట్‌కు రూ.30వేలు, రెండు కిలోవాట్లకు రూ.60వేలు, మూడు కిలోవాట్లకు, ఆపైన యూనిట్లకు రూ.78వేలు చొప్పున కేంద్రం రాయితీ ఇస్తుందని వివరించారు. ఆసక్తి గల వారు 'పీఎంఎస్‌యూఆర్‌వైఏజీహెచ్ ఏఆర్.జీవోవీ.ఇన్, ఏపీఎస్పీడీసీఎల్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు కోసం టోల్ ఫ్రీ నెంబరు 1912 ద్వారా సంప్రదించాలని సూచించారు. 100 కిలో వాట్లకు పైబడిన ప్రభుత్వ కార్యాలయాల్లో ఎస్‌వీవీఎస్, నెడ్ క్యాప్ ఫేజ్-1 సౌర విద్యుత్ ప్లాంట్లు అమర్చడానికి అధికారులు ప్రణాళికలు రూపొందించాలని, మోడల్ సోలార్ విలేజ్ కోసం 5000 జనాభా ఉన్న ఐదు గ్రామాలను తీసుకుని సోలార్ గ్రామాలుగా తీర్చి దిద్దే ప్రణాళికలు రూపొందించాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. సోలార్ విద్యుత్ ఉత్పత్తికి జిల్లాలో 112 ప్రభుత్వ కార్యాలయాలను గుర్తించినట్లు నెడ్‌క్యాప్ మేనేజర్ దిలీప్‌కుమార్‌రెడ్డి తెలిపారు. అనంతరం గ్రామ స్థాయి జనసురక్ష కార్యక్రమం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో జడ్పీ సీఈవో జుబేదా, డీపీవో సుశీల దేవి, లీడ్ బ్యాంక్ మేనేజరు విశ్వనాథరెడ్డి, డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు, నాబార్డు డెవలప్‌మెంట్ మేనేజరు సునీల్, ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈ సురేంద్రనాయుడు, నెడ్‌క్యాప్ డెవలప్‌మెంట్ మేనేజర్ దిలీప్‌కుమార్‌రెడ్డి, కార్పొరేటర్ ఆర్‌సీ మునికృష్ణ పాల్గొన్నారు.

భూసేకరణ పనులను వేగవంతం చేయండి

జాతీయ రహదారి, రైల్వేశాఖ, రెవెన్యూకు సంబంధించి జిల్లాలో పెండింగ్‌లో ఉన్న భూసేకరణ పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ నుంచి భూసేకరణపై మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. రెవెన్యూ డివిజన్ అధికారులు ఎప్పటికప్పుడు ఎన్.హెచ్. అధికారులతో సమన్వయం చేసుకుని రహదారుల పనులు పురోగతిలో ఉండేలా చూడాలన్నారు. కాలూరు- పీలేరు, రేణిగుంట- నాయుడుపేట, గూడూరు- సూళ్లూరుపేటకు సంబంధించిన సాగరమాల రహదారుల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఈ సమీక్షలో జాయింట్ కలెక్టర్ శుభంబన్సల్ పాల్గొన్నారు.

చెరువుల సుందరీకరణ పనులు చేపట్టండి

తిరుపతి నగరంలోని చెరువుల సుందరీకరణ పనులను ప్రాధాన్యతగా తీసుకుని యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ నుంచి నగరంలోని వివిధ చెరువులు, కుంటల సుందరీకరణ పనుల పురోగతిపై చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, జేసీ శుభం బన్సల్‌తో కలిసి అధికారులతో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. నీటి వనరులను అభివృద్ధి చేయడానికి చెరువులు పునరుద్ధరించడం కోసం సుందరీకరణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. వినాయక సాగర్, పాన్‌చెరువు, గొల్లవానికుంట, కొరమేనుగుంట చెరువుల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలన్నారు. స్మార్ట్ సిటీలో భాగంగా వినాయక సాగర్, గొల్లవానిగుంట అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. తుడా అవిలాలచెరువు అభివృద్ధికి యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలన్నారు.

రేపు శ్రీవారి ఆర్జిత సేవా టికెట్ల కోటా విడుదల

తిరుమల, నవంబరు19(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆర్జిత సేవా టికెట్ల ఫిబ్రవరి నెల కోటాను టీటీడీ గురువారం విడుదల చేయనుంది. కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకరణ సేవ టికెట్లను గురువారం ఉదయం 10 గంటలకు ఆన్‌లైన్ ద్వారా విడుదల చేయనున్నారు. కాగా, మరికొన్ని ఆర్జితసేవా టికెట్లకు సంబంధించి ఎలక్ట్రానిక్ డిప్ కోటాను టీటీడీ ఇప్పటికే ఆన్‌లైన్‌లో విడుదల చేసింది. వీటిని భక్తులు బుధవారం ఉదయం 10 గంటల వరకు నమోదు చేసుకోవచ్చు. ఇక, అంగప్రదక్షిణ టికెట్ల కోటాను 23న ఉదయం 10 గంటలకు విడుదల చేస్తారు. అదేరోజు మధ్యాహ్నం 3 గంటలకు వయోవృద్ధులు, దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధులున్న వారి కోసం ప్రత్యేక దర్శన టోకెన్లు విడుదల చేయనున్నారు. 24వ తేదీ ఉదయం 10 గంటలకు రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్ల కోటాను విడుదల చేయనున్నారు.

ఈ విద్యార్థి ఏమయ్యాడు?



కాశ్యప ఆదిత్య

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో డిగ్రీ ఫైనలియర్ చదువుకుంటున్న కాశ్యప ఆదిత్య (19) అదృశ్యమయ్యాడు. ఈమేరకు ఆదిత్య సోదరుడు హైదరాబాదు నుంచీ పోలీసులకు ఫోన్ ద్వారా ఫిర్యాదు చేసినట్టు తెలిసింది. అదృశ్యమైన విద్యార్థికి సంబంధించిన ఫోన్, ఐడీ కార్డు సంస్కృత వర్సిటీలోని గరుడాచలం హాస్టల్‌లోనే వదిలి వెళ్ళినట్టు తెలుస్తోంది. దీంతో పోలీసులు అదృశ్యమైన విద్యార్థి ఆచూకీ తెలుసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ఆటోలో బయటికి వెళ్ళినట్టు యూనివర్సిటీ హాస్టల్ సీసీ ఫుటేజీలో రికార్డు అయినట్టు తెలుస్తోంది. ఈ వ్యవహారంపై వెస్ట్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

24నుంచి గ్రామీణ ప్రీమియర్‌లీగ్

తిరుపతి(క్రీడలు), నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ఇషా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల 24వ తేదీ నుంచి 16వ గ్రామోత్సవం, రూరల్ ప్రీమియర్‌లీగ్-2024 పోటీలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. ఈ పోటీలకు సంబంధించిన గోడపత్రికలను మంగళవారం కలెక్టరేట్‌లో కలెక్టర్, జేసీ శుభంబన్సల్, డీఎస్‌డీవో సయ్యద్‌సాహేబ్, ఇషా ఫౌండేషన్ ప్రతినిధులు ఆవిష్కరించారు. 24న ఎస్వీయూ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో తొలివిడతగా పురుషులకు వాలీబాల్, మహిళలకు త్రోబాల్ పోటీలు జరుగనున్నాయి. ఇప్పటికే ఆన్‌లైన్‌లో నమోదుచేసుకున్న ప్రతి పంచాయతీ క్రీడా జట్లు ఈ పోటీలకు అర్హులు. ముందస్తు నమోదు తప్పనిసరి. మరిన్ని వివరాల కోసం 83000 30999 నెంబరులో సంప్రదించాలి. ఈ పోటీల్లో మొదటి రెండు స్థానాలు కైవసం చేసుకొన్న జట్లు జోనల్‌స్థాయి పోటీలకు అర్హత సాధించి విజయవాడలో డిసెంబరు మొదటి వారంలో జరిగే పోటీలలో పాల్గొంటారు. అక్కడి విజయం సాధించిన జట్లు డిసెంబరు 28న కోయంబత్తూరులోని ఇషా కేంద్రంలో జరిగే తుది సమరంలో పాల్గొంటాయి.

- వాలీబాల్ విజేతలకు మొదటి బహుమతి రూ.9వేలు, రెండో బహుమతి రూ.6వేలు, మూడో బహుమతి రూ.3వేలు, నాలుగో బహుమతి రూ.2వేలు.
- త్రోబాల్ విజేతలకు మొదటి బహుమతి రూ.5వేలు, రెండో బహుమతి రూ.3వేలు, మూడో బహుమతి రూ.2వేలు, నాల్గో బహుమతి రూ.1,500.



భూములను పరిశీలిస్తున్న ఆర్డీవో

ప్రభుత్వ భూములను గుర్తించి కాపాడండి

రామచంద్రాపురం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని చుట్టుగుంట రామాపురంలో సర్వే నంబరు 102లోని 288 ఎకరాలను ఆర్డీవో రామ్మోహన్ మంగళవారం పరిశీలించారు. గతంలో గంగిరెడ్డిపల్లి, మిట్టూరు, సి.రామాపురం దళితులకు 141 ఎకరాలను కేటాయించామని అధికారులు ఆయనకు వివరించారు. అన్నస్వామి గండిచెరువుకు 20 ఎకరాలు, కాలువలు, రహదారులకు 28 ఎకరాలు కేటాయించామన్నారు. ఇక్కడ ప్రభుత్వ భూమి 58 ఎకరాలు ఉన్నట్లు ఆర్డీవో గుర్తించారు. అన్నాసామి గండిచెరువు, సీజేఎఫ్ఎస్ భూములు, రోడ్లు, కాలువలు, ప్రభుత్వ భూములను సర్వే చేసి నివేదికలు సిద్ధం చేయాలని తహసీల్దారు వెంకటరమణ, సర్వేయర్ రమేష్‌బాబును ఆదేశించారు. 58 ఎకరాల ప్రభుత్వ భూమిని ప్రజాప్రయోజనాల కోసం ఉపయోగించుకునేందుకు ల్యాండ్ బ్యాంకింగ్ చేయాలన్నారు. ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు.



మాల కార్పొరేషన్ సభ్యురాలిగా కుమారమ్మ

తిరుపతి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మాల కార్పొరేషన్ సభ్యురాలిగా తిరుపతికి చెందిన తెలుగు మహిళా నేత పురిమిట్ల కుమారమ్మ నియమితులయ్యారు. ఎస్సీల సంక్షేమం కోసం కృషిచేస్తానని ఆమె చెప్పారు.

అభివృద్ధికి పచ్చజెండా

● 'పద్మావతి' వర్సిటీ పాలకమండలిలో పలు తీర్మానాలు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): పద్మావతి మహిళా యూనివర్సిటీలో అభివృద్ధికి మంగళవారం జరిగిన పాలక మండలి సమావేశంలో పలు తీర్మానాలు చేశారు. రాష్ట్ర ఉన్నత విద్య, ఆర్థిక శాఖల అధికారులు వర్చువల్‌గా ఈ సమావేశంలో పాల్గొనగా, పద్మావతి వర్సిటీ నుంచీ వీసీ ప్రొఫెసర్ ఉమ, రిజిస్ట్రార్ రజని, పాలకమండలి సభ్యులు హాజరయ్యారు. ఇటీవల యూనివర్సిటీకి మంజూరైన రూ.100 కోట్ల పీఎం ఉష పథకం నిధులను భవన నిర్మాణాలు, ఇతర అభివృద్ధి కార్యక్రమాలకు వినియోగించడంపై చర్చించారు. విద్యుత్ ఖర్చును తగ్గించడం కోసం సోలార్ ప్యానల్స్ ఏర్పాటుకు పాలకమండలి పచ్చజెండా ఊపింది. వెబ్‌సైట్, ఇంటర్‌నెట్, సీసీ ఫుటేజీల నిర్వహణ, వంటి అంశాల్లో నాణ్యతను పెంపొందించాలని తీర్మానించినట్టు తెలిసింది.

అమ్మవారి సేవలో ఉత్తరాది మఠం పీఠాధిపతి

తిరుచానూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): తిరుచానూరులోని పద్మావతి అమ్మవారిని మంగళవారం ఉత్తరాది మఠం పీఠాధిపతి సత్యాత్మతీర్థ స్వామీజీ శిష్య బృందంతో కలిసి దర్శించుకున్నారు. ఆలయం వద్ద డిప్యూటీ ఈవో గోవింద రాజన్, అర్చకులు వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ముందుగా ధ్వజస్థంభానికి నమస్కరించి తర్వాత సన్నిధిలోని అమ్మవారి మూల మూర్తిని వారు దర్శించుకున్నారు. ఆలయ ఏఈవో దేవరాజులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, సుబ్బరాయుడు, చలపతి, సుభాస్కర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.



అమ్మవారి ఆలయం వద్ద సత్యాత్మతీర్థ స్వామీజీ

పార్శిల్ కేంద్రాల్లో పోలీసుల తనిఖీలు



తిరుపతి రైల్వే స్టేషన్‌లో పోలీసుల తనిఖీలు

తిరుపతి(నేరవిభాగం),నవంబరు 19(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా పార్శిల్ కేంద్రాల్లో పోలీసులు మంగళవారం సాయంత్రం నుంచి రాత్రి వరకు తనిఖీలు నిర్వహించారు. గంజాయి, మత్తుపదార్థాల నిర్మూలన కోసం తిరుపతి, నాయుడుపేట, శ్రీకాళహస్తి, చంద్రగిరి, సూళ్ళూరుపేట, వాకాడు, సత్యవేడు ప్రాంతాల్లో ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. పార్శిల్ కేంద్రాల నుంచి రవాణా అవుతున్నాయనే అనుమానంతో డీఎస్పీల నేతృత్వంలో సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది తనిఖీలు చేశారు. తిరుపతిలో రైల్వే స్టేషన్, బస్టాండు ప్రాంతాల్లో ఈస్ట్ సీఐ రామకృష్ణ నేతృత్వంలో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఏదైనా సమాచారం ఉంటే వెంటనే డయల్ 112 కు లేదా పోలీసు వాట్సాప్ నెంబరు 8099999977 కు ఫోన్ చేసి సమాచారం అందివ్వాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

నలుగురు స్మగ్లర్ల అరెస్ట్

● 35 ఎర్రచందనం దుంగలు స్వాధీనం

మంగళం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): రెండు వేర్వేరు ఘటనల్లో నలుగురు ఎర్రచందనం స్మగ్లర్లను టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేసి 35 దుంగలు, ఒక కారు, ఒక లారీని స్వాధీనం చేసుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. టాస్క్ ఫోర్స్ ఎస్పీ పి.శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఆర్ఐ సురేష్‌కుమార్‌రెడ్డికి చెందిన ఆర్ఎస్ఐలు కేఎస్‌కె లింగాధర్, టి.విష్ణువర్ధన్‌కుమార్, సిబ్బంది ఏర్పేడు మండలం చింతలపాలెం చెక్‌పోస్టులో మంగళవారం తెల్లవారుజామున తనిఖీలు నిర్వహించారు. ముగ్గురు వ్యక్తులు ఒక కారులో వేగంగా రావడాన్ని గమనించి ఆపి తనిఖీ చేయగా అందులో పది దుంగలు ఉన్నాయి. ఆ ముగ్గురిని అదుపులోకి తీసుకుని విచారించగా, వారు తమిళనాడుకు చెందిన వారని గుర్తించారు. కారులోని దుంగలను స్వాధీనం చేసుకున్నారు. మరో ఘటనలో కడప సబ్ కంట్రోల్‌లోని ఆర్ఐ ఎం.చిరంజీవులుకు చెందిన ఆర్ఎస్ఐ మురళీధర్‌రెడ్డి బృందం చంద్రగిరి మండలం పాతవాటివారిపల్లెకు సమీపంలో అటవీ ప్రాంతంలో డంపింగ్ యార్డు వద్ద కొంత మంది ఎర్రచందనం దుంగలను ఓ లారీలో తరలించేందుకు లోడ్ చేస్తుండగా చుట్టుముట్టడంతో స్మగ్లర్లు పోరియారు. అందులోని ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకుని వారి నుంచి 25 ఎర్రచందనం దుంగలను, ఒక లారీని స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడ్డ స్మగ్లర్ కర్నాటకకు చెందిన వాడుగా గుర్తించారు. రెండు సంఘటనల్లో పట్టుబడిన స్మగ్లర్లు, దుంగలను, వాహనాలను తిరుపతి టాస్క్‌ఫోర్స్ పోలీస్‌స్టేషన్‌కు తరలించి సీఐఎం సురేష్‌కుమార్, ఎస్ఐ సీహెచ్ రఫీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ కేసు వెనుక ఉన్న ఇతర స్మగ్లర్లను అరెస్ట్ చేయడానికి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు టాస్క్‌ఫోర్స్ ఎస్పీ పి.శ్రీనివాస్ తెలిపారు.



పట్టుబడ్డ స్మగ్లర్లను అరెస్ట్ చూపుతున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు

పుత్తూరు వార్తలు

లీజు చెల్లింపులకు 3 నెలల గడువు

● పుత్తూరు మున్సిపాల్ కౌన్సిల్ ఆమోదం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

పుత్తూరు అర్బన్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు మున్సిపాలిటీకి లీజు బకాయిలను చెల్లించడానికి మున్సిపాల్ కౌన్సిల్ మూడు నెలల గడువిస్తూ ఆమోదం తెలిపింది. ఈనెల 16వ తేదీన 'అద్దె వసూళ్లలో నిర్లక్ష్యం' శీర్షికన ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి మున్సిపల్ కౌన్సిల్, అధికారులు స్పందించారు. 2017-24 మధ్య మున్సిపల్ కాంప్లెక్స్‌లోని అద్దె గదులు, మున్సిపల్ మార్కెట్, జంతువధశాల, ప్రైవేటు బస్టాండ్ లీజులు వడ్డీ సహా రూ.82.35 లక్షలు బకాయిలు పేరుకుపోయాయి. లీజుదారుల నుంచి బకాయిల వసూలుకై దావా దాఖలు చేసేందుకు కౌన్సిల్ అజెండాలో పొందు పరిచారు. కౌన్సిల్ ఆమోదంతో తమ చేతికి మట్టి అంటకుండా చేతులు దులుపుకునే ప్రయత్నం చేశారు. ఆంధ్రజ్యోతి దినపత్రికలో లీజు బకాయిలపై కథనం ప్రచురితం కావడంతో, తప్పని పరిస్థితుల్లో మూడు నెలల గడువును కౌన్సిల్ ఆమోదించింది. బకాయిలు వసూలు కాని పక్షంలో 2017 నుంచి ఇప్పటి వరకు పుత్తూరు మున్సిపల్ కమిషనర్లుగా, రెవెన్యూ అధికారులుగా పనిచేసిన వారిని బాధ్యులను చేస్తూ వారిపై శాఖాపరమైన చర్యలు ఉంటాయని తెలుస్తోంది.

మున్సిపల్ ఆదాయానికి గండి

● కాంప్లెక్స్‌లో 29 అద్దె గదులకు వేలం

● రెండు గదులు మాత్రమే దక్కించుకున్న కాంట్రాక్టర్లు



పుత్తూరు అర్బన్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): పుత్తూరు మున్సిపల్ ఆదాయానికి గండి పడేలా అధికారుల తీరు కనిపిస్తోంది. ప్రజల నుంచి పన్నులు వసూలు చేయడంలో చూపే చొరవ సొంత ఆస్తులను సద్వినియోగం చేసుకుని ఆర్థిక ప్రయోజనం పొందలేని దుస్థితికి దిగజారారు. ఈ నెల 14న మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లో లీజు ప్రాతిపదికన గదులు కేటాయించేందుకు వేలం నిర్వహించారు. ఈ వేలంలో మొత్తం 29 గదులకు వేలం నిర్వహించగా 2 గదులను మాత్రమే కాంట్రాక్టర్లు దక్కించుకున్నారు. ఈ రెండు గదుల నుంచి రూ.20 వేలు ఆదాయం చేకూరిందని కమిషనర్ మంజునాథ్ గౌడ్ పేర్కొన్నారు. మిగిలిన 27 గదులు దక్కించుకునేందుకు ఎవ్వరూ ముందుకు రాలేదు. ఈ గదులు దాదాపు ఏళ్లుగా నిరుపయోగంగా ఉండిపోయాయి. ఈ గదులను కొందరు వ్యాపారాలు తమ సామాగ్రిని భద్రపరుచుకుంటూ అక్రమంగా వినియోగించుకుంటున్నారు. ఈ దుకాణాల నిర్మాణాల విషయంలో మున్సిపాలిటీ, రైల్వే మధ్య చిన్నపాటి సమస్య నెలకొంది. మున్సిపల్ కాంప్లెక్స్ నుంచి వెలుపలికి వచ్చే మార్గాలకు అడ్డుగా రైల్వే అధికారులు గోడ నిర్మించారు. పలువురు కమిషనర్లు వచ్చారు... వెళ్లారు. ఈ సమస్య పరిష్కారానికి ఏ ఒక్కరు కృషి చేయలేదు. ఈ విషయమై కమిషనర్ మంజునాథ్ గౌడ్‌ను వివరణ కోరగా.. మున్సిపల్ కాంప్లెక్స్ దారి విషయంలో నెలకొన్న ఇబ్బందులను క్షేత్రస్థాయిలో పరిశీలించాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించామన్నారు. త్వరలో సమస్య పరిష్కారమవుతుందని తెలిపారు.

నలుగురు నిందితులపై కేసు నమోదు

పుత్తూరు అర్బన్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని వేపగుంటలో ఈనెల 17న ఆదివారం రాత్రి గంజాయి మత్తులో హల్‌చల్ చేసిన నలుగురు నిందితులపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఇందులో ఓ విద్యార్థి కూడా ఉన్నారు. గ్రామంలో చోటుచేసుకున్న పరిణామాలను ఎస్‌ఐ ఓబయ్య స్వయంగా వెళ్లి పరిశీలించిన విషయం విదితమే. ఈక్రమంలో మంగళవారం వేపగుంట గ్రామస్తులను సీఐ సురేంద్రనాయుడు విచారించారు. చుట్టుపక్కల వారిని ఆరా తీశారు. ఈ క్రమంలో లెక్కల యతిరాజులు ఇంటిపై దాడికి యత్నించిన విషయం వాస్తవమని తేల్చారు. దాడికి యత్నించిన నలుగురిపై కేసు నమోదు చేశారు.

కమనీయం పార్వతీ పరమేశ్వరుల కల్యాణం



వడమాలపేట, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని భవానీ శంకర ఆలయ వార్షికోత్సవాల్లో చివరి రోజు మంగళవారం పార్వతీపరమేశ్వరుల కల్యాణం శివనామ స్మరణ లతో కమనీయంగా జరిగింది. ఉదయం అగ్నిహోమం నిర్వహించి 108 కలశాలను ప్రతిష్ఠించారు. పవిత్ర గంగాజలంతో, విశేష ద్రవ్యాల సహా పంచామృతంతో మహా శివలింగానికి అభిషేకం నిర్వహించారు. అనంతరం మహాశివుడికి ప్రత్యేకంగా అలంకరించి మంగళ హారుతులిచ్చారు. స్వామివారి జన్మనక్షత్రం ఆరుద్ర సందర్భంగా సాయంత్రం పార్వతీపరమేశ్వరుల ఉత్సవమూర్తులను పట్టువస్త్రాలతో వధూవరులుగా అలంకరించారు. అర్చకులు శివ, సాయి ఆధ్వర్యంలో వేదమంత్రాలు, మంగళ వాయిద్యాలు భక్తుల శివనామ స్మరణల నడుమ మాంగల్యధారణ చేయించారు. తీర్థప్రసాద వినియోగంతోపాటూ భక్తులకు అన్నదానం జరిగింది

ఆధార్ సేవలను సద్వినియోగం చేసుకోండి

వడమాలపేట, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల సౌలభ్యం కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక ఆధార్ సేవలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో శేషగిరి రావు కోరారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ నెల 22 వరకు ప్రత్యేక కేంద్రం ద్వారా ఆధార్ సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. ఆధార్ కార్డులలో మార్పులు, చేర్పులకు అవకాశం ఉందని చెప్పారు.

గ్రంథాలయాలను...

వడమాలపేట, నవంబర్ 19(ఆంధ్రజ్యోతి): పుస్తక పఠనం ద్వారా విజ్ఞానాన్ని పెంచుకోవచ్చని అందుకోసం గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయ అధికారి దాక్షాయని చెప్పారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా విద్యుర్థులతో పుస్తక పఠనం చేయించారు. ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులు జయలలిత, కుమారి, సంధ్య, మంజుల పాల్గొన్నారు.

పుస్తక పఠనం లేకే నేరాల పెరుగుదల



ప్రసంగిస్తున్న చంద్రమౌళి

పుత్తూరు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): పుస్తక పఠనం తగ్గిపోవడం వల్లే నేరాలు పెరుగుతున్నాయని పుత్తూరు డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ చంద్రమౌళి విశ్లేషించారు. కళాశాలలో జరిగిన గ్రంథాలయ వారోత్సవాల్లో కథారచయిత కృష్ణస్వామిరాజు మాట్లాడుతూ... పుస్తక పఠనం వల్ల సంస్కారం వస్తుందని, విద్యాలయానికి గ్రంథాలయం గుండె వంటిదన్నారు. అనంతరం ఉత్తమ పాఠకులుగా గుర్తించిన విద్యార్థులకు బహుమతులను అందించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు వీరయ్య, నరసింహులు, మన్యం నరసింహులు, నాగేశ్వరరావు, శ్రీదేవి పాల్గొన్నారు.

విద్యార్థులు కళ్లను కాపాడుకోవాలి



పుత్తూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): భవిష్యత్తును అందంగా మలచుకునేందుకు విద్యార్థులు కళ్లను జాగ్రత్తగా కాపాడుకోవాలని పిళ్లారిపట్టు పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ కుమార్ అన్నారు. జాతీయ అంధత్వ నివారణ దినాన్ని మంగళవారం కళాశాలలో నిర్వహించారు. డాక్టర్ రవిశంకర్ రెడ్డి పరీక్షలు నిర్వహించి కంటి చూపు లోపించిన విద్యార్థులకు కళ్లద్దాలను ఉచితంగా అందించారు. ఈ కార్యక్రమంలో శేఖర్‌రెడ్డి, హరీష్ పాల్గొన్నారు.

గూడూరు

సూళ్లూరుపేట/వెంకటగిరి

ఏటి కాలవలో పడి ఒకరి మృతి



మృతి చెందిన సుబ్రహ్మణ్యం

గూడూరు అర్బన్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని తిప్పారపాడు గ్రామం వద్ద ఏటి కాలవలో పడి ఒకరు మృతి చెందాడు. గూడూరు రూరల్ ఎస్‌ఐ మనోజ్ కుమార్ వివరాలు మేరకు.. మండలంలోని తిప్పారపాడు గ్రామానికి చెందిన సుబ్రహ్మణ్యం(51) సోమవారం పశువులను మేపేందుకు ఏటి కాలువ వద్దకు వెళ్లాడు. అకస్మాత్తుగా మూర్ఛ రావడంతో కాలువలో పడి మృతి చెందాడు. మంగళవారం ఉదయం కాలువ సుబ్రహ్మణ్యం తేలియాడుతుండడంతో స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా పరిశీలించి మృతదేహాన్ని ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతుడి చెల్లెలు సుబ్బమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

గుండెపోటుతో జూనియర్ అసిస్టెంట్ మృతి

గూడూరు అర్బన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): గూడూరు ఎంపీడీవో కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న బ్రహ్మయ్య(45) గుండె పోటుతో మంగళవారం మృతి చెందారు. ఉద్యోగుల కథనం మేరకు... బ్రహ్మయ్య శబరిమలైకి వెళ్లి అయ్యప్ప స్వామిని దర్శించుకుని తిరిగి వస్తుండగా మంగళవారం కేరళలోని టెంగనూరు సమీపంలో గుండెపోటుతో మృతి చెందినట్లు తెలిపారు. ఉద్యోగులు, సిబ్బంది సంతాపం వ్యక్తం చేశారు.

ఆటో ఢీకొని వృద్ధుడి దుర్మరణం



ఈశ్వరయ్య మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఐ మనోజ్ కుమార్

గూడూరు అర్బన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొల్లపల్లి సమీపంలో ఆటో ఢీకొనడంతో వృద్ధుడి మృతి చెందిన మంగళవారం సంఘటన చోటు చేసుకుంది. గూడూరు రూరల్ ఎస్‌ఐ మనోజ్ కుమార్ వివరాలు మేరకు... బాలాయపల్లి మండలానికి చెందిన ఈశ్వరయ్య(60) గేదెలను మేపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. సోమవారం నుంచి గెదెలు కనపించకపోవడంతో వాటిని వెతికేందుకు గొల్లపల్లి వైపు వెళ్తుండగా వెంకటగిరినుంచి గూడూరు వైపు వెళ్తున్న ఆటో అదుపుతప్పి ఈశ్వరయ్యను ఢీకొనడంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఇంటి నిర్మాణం అడ్డగింత



రేణిగుంట, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): పంచాయతీలోని శివకుమార్‌నగర్‌లో ఓ ఇంటి నిర్మాణాన్ని రెవెన్యూ అధికారులు అడ్డుకున్నారు. మంగళశారం శివకుమార్‌నగర్‌లోని ఓ స్థలంలో కడగాలు వేస్తుండగా ఆ ప్రాంతానికి చెందిన స్థానికులు రెవెన్యూ, పోలీసు అధికారులుకు ఫిర్యాదు చేశారు. దీంతో వీఆర్వో సుబ్రహ్మణ్యం అక్కడికి చేరుకుని నిర్మాణాలను అడ్డుకున్నారు. స్థలానికి సబంధించిన ధ్రువీకరణపత్రాలుంటే తహసీల్దారు కార్యాలయంలో సంప్రదించాలని వీఆర్వో చెప్పారు. కాగా ఈ స్థలంలో అంబేడ్కర్ భవనం నిర్మించాలని గత పంచాయతీ బోర్డు తీర్మానించింది.

ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు



వాహనదారులకు సూచనలిస్తున్న పోలీసులు

వరదయ్యపాళెం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోతే చర్యలు తప్పవని ఎస్‌ఐ మల్లికార్జున్ హెచ్చరించారు. పట్టణంలోని బస్టాండు ఆవరణలోని వాహనాలను క్రమపద్ధతిలో పార్కింగ్ చేయాలని కోరారు. మంగళవారం ఆయన వాహన తనిఖీలు చేపట్టారు. బస్సులను బస్టాండులోనే ఉంచి ప్రయాణికులను ఎక్కించుకోవాలన్నారు. అదే విధంగా దుకాణదారులు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమలో హెడ్‌కానిస్టేబుల్ ముని, కానిస్టేబుళ్లు హరి, సుబ్బు, చలపతి తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా శ్రీవారి గ్రామోత్సవం



వరదయ్యపాళెం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నపాండూరులో నూతనంగా నిర్మించిన శ్రీభూమి, నీలాదేవి సమేత శ్రీనివాసస్వామి ఆలయంలో మహా సంప్రోక్షణ వేడుకల్లో భాగంగా మంగళవారం స్వామిఅమ్మవార్ల గ్రామోత్సవం నిర్వహించారు. ముందుగా స్వామిఅమ్మవార్ల ఉత్సవ మూర్తులకు పలు అభిషేకాలు నిర్వహించిన అనంతరం విశేషంగా అలంకరించిచ పుష్ప సింహాసనంపై అధిష్ఠింప జేశారు. అనంతరం ఆసీనులై మేళతాళాలు, మంగళవాయిద్యాలు, వేదమంత్రోచ్ఛరణల నడుమ గ్రామోత్సవం నిర్వహించారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు

సత్యవేడు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ పరిధిలోని సత్యవేడు, పిచ్చాటూరు, శ్రీసిటీ ప్రాంతాల్లో పుత్తూరు మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్ మంగళవారం వాహన తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో పర్మిట్, డ్రైవింగ్ లైసెన్స్, పొల్యూషన్ సర్టిఫికెట్ తదితర రికార్డులు సక్రమంగా లేని 11 వాహనాలను గుర్తించి, రూ.94 వేలు జరిమానా విధించారు. పిచ్చాటూరులలో రెండు వాహనాలు, శ్రీసిటీలో మూడు వాహనాలు, సత్యవేడులో ఆరు వాహనాలకు జరిమానా విధించినట్టు ఎంవీఐ తెలిపారు.





సొసైటీసెంటర్‌లో గోతులమయంగా రోడ్డు - స్వర్ణభారతి నగర్‌లో వర్షపునీటిలో నిలిచిపోయిన ఆటోను నెడుతున్న స్థానికులు

గోతులు లేని రోడ్లే లేవు!

● మడుగుల్లా రహదారులు

● రాకపోకలకు జనం అవస్థలు



రైల్వేస్టేషన్ సమీపంలో గోతుల రోడ్డులో నిల్వచేరిన వర్షపునీరు

గూడూరు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): పట్టణంలో రద్దీగా ఉండే పలు ప్రాంతాల్లో రోడ్లు గోతులమయంగా మారడంతో రాకపోకలు సాగించేందుకు స్థానికులు అవస్థలు పడుతున్నారు. చిన్నపాటి వర్షానికే గోతులమయంగా మారిన రోడ్లలో వర్షపునీరు నిల్వచేరి మడుగులను తలపిస్తున్నాయి. నీరునిల్వ చేరడంతో గోతుల లోతు అంచనా వేయలేక వాహనదారులు ప్రమాదాలకు లోనవుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వం రోడ్ల అభివృద్ధికి ఎటువంటి చర్యలు చేపట్టకపోవడంతో పట్టణంలోని ప్రధాన రహదారులు దారుణంగా దెబ్బతిన్నారు. స్థానిక సొసైటీ సెంటర్‌లో రోడ్డు రూపుకోల్పోయి గోతులమయంగా దారుణంగా తయారయ్యింది. రెండో పట్టణం నుంచి ఒకటో పట్టణానికి రాకపోకలు సాగించే ప్రధాన రహదారి స్వర్ణభారతి నగర్ సమీపంలోని తిరుపతి రైల్వేగేటు వద్ద వర్షం పడిందంటే మోకాలు లోతు నీరు నిల్వ చేరిపోతుంది. ఈ మార్గం ద్వారా ఒకటో - రెండో పట్టణాలకు రాకపోకలు సాగిస్తుంటారు. ప్రధానంగా ఎస్‌కేఆర్ డిగ్రీ, జూనియర్ కళాశాల, ఐటీ, సిరామిక్, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలకు ఒకటో పట్టణానికి చెందిన వారు, ఇతరులు ఈ మార్గం ద్వారా రాకపోకలు సాగిస్తుంటారు. చిన్నపాటి వర్షానికే నీరు నిల్వ చేరి మడుగుగా మారడంతో వాహనదారులు, పాదాచారుల కష్టాలు వర్ణనాతీతంగా మారాయి. వాహనాల ఇంజన్లలోకి నీరు చేరి వాహనాలు మధ్యలోనే నిలిచిపోతుండడంతో నానా అగచాట్లు పడాల్సి వస్తోందనని ఆవేదన చెందుతున్నారు. ఇదేవిధంగా స్థానిక రైల్వేక్వార్టర్స్ సమీపంలో, రైల్వేస్టేషన్ నుంచి రైల్వే క్వార్టర్స్‌కు వెళ్లే మార్గంలో రైల్వేస్టేషన్ సమీపంలో రోడ్డు అక్కడక్కడ దెబ్బతిని గోతులమయంగా మారడంతో వర్షపునీరు నిల్వచేరి ఉండడంతో రాకపోకలు కష్టతరంగా ఉన్నాయని స్థానికులు అంటున్నారు. సంబంధిత అధికారులు స్పందించి పట్టణంలో రోడ్లను బాగు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ల చోరీలను అరికట్టండి



ధ్వంసమైన ట్రాన్స్‌ఫార్మర్

గూడూరు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): పొలాల్లో ట్రాన్స్‌ఫార్మర్ల చోరీలను అరికట్టేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు. కొందరు రాత్రి సమయాల్లో ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి అందులోని కాపర్ వైరు, విద్యుత్ తీగలను అపహరించుకుని వెళుతున్నారు. దీంతో పంటలకు నీరు పెట్టుకునేందుకు విద్యుత్ సౌకర్యం లేక అవస్థలుపడాల్సి వస్తోందని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఐదు రోజుల క్రితం వెస్ట్‌గూడూరు ప్రాంతంలోని పంబలేరు సమీపంలో రైతులు పెంచలనరసారెడ్డి, వెంకటేశ్వర్లు పొలాల్లోని 25, 16 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లను కొందరు ధ్వంసంచేసి అందులోని వస్తువులను అపహరించుకు వెళ్లారు. అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్ల చోరీలను అరికట్టడంతో పాటు త్వరితగతిన ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేపట్టి సాగుకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

భూసార పరీక్షలతో అధిక దిగుబడులు



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న రైతులు, ప్రకృతి వ్యవసాయ ప్రతినిధులు

కోట, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): భూసార పరీక్షల ద్వారా అధిక దిగుబడులు వస్తాయని మండల వ్యవసాయ అధికారి వంజివాక నిరంజన్‌కుమార్ అన్నారు. మండల పరిధిలోని నెల్లూరుపల్లి కొత్తపాళెం, కోట గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. ప్రకృతి వ్యవసాయం వల్ల ఉపయోగాలపై పోస్టర్లను అధికారులు, రైతులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వరి నారుమడిలో కలుపు యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. అనంతరం ఆయా గ్రామాల్లో రైతులు పోసిన నారుమడులను అధికారులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి సాయి కుమార్, వ్యవసాయ సహాయకులు ప్రభు కిరణ్, వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, నోడల్ మేకర్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

మాజీ ప్రధాని ఇందిరాగాంధీకి నివాళి

సూళ్లూరుపేట, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలో ఆర్టీసీ బస్టాండు సెంటర్ వద్ద మంగళవారం మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి నిర్వహించారు. ఆమె చిత్రపటానికి కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ వెంకటా చలపతి ఆధ్వర్యంలో నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బద్దెపూడి రాజారెడ్డి, పొన్నా లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ఝాన్సీలక్ష్మీబాయి జయంతి

నాయుడుపేట, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని టీఎంఆర్ కళాశాలలో మంగళవారం ఝాన్సీలక్ష్మీబాయి జయంతి వేడుకలను నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏబీవీపీ జిల్లా కన్వీనర్ సన్ని, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తణుకు చెందు, విద్యార్థులు పాల్గొన్నారు.

తీర ప్రాంత రక్షణపై రెండు రోజుల శిక్షణ

సూళ్లూరుపేట, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): తీర ప్రాంత రక్షణ, భద్రతపై శ్రీహరికోట పోలీస్ స్టేషన్‌లో బుధ, గురువారాల్లో రెండు రోజుల నేవీ, కోస్టుగార్డ్, మెరైన్, సివిల్ పోలీసులకు తీరప్రాంత రక్షణపై ఎక్సర్‌సైజ్ సీవిజిల్ శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు సూళ్లూరుపేట సీఐ మురళీకృష్ణ తెలిపారు.

పోస్టాఫీసుల్లో ఖాతాల కోసం ప్రత్యేక క్యాంప్‌లు

తడ, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాల లబ్ధిదారులకు పోస్టాఫీసుల్లో కొత్తగా ఖాతా తెరవడానికి ప్రత్యేక క్యాంప్‌లు నిర్వహిస్తున్నమని ఎంపీడీవో విజయ్‌కుమార్ తెలిపారు. మంగళవారం ఆయన పంచాయతీ కార్యదర్శులు, పోస్టల్ అధికారులతో సమావేశం నిర్వహించారు.

పాఠశాలల పనివేళల పెంపు సరికాదు

బాలాయపల్లి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): పాఠశాల పనివేళల పెంపు సరైన నిర్ణయం కాదని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు రమేష్ బాబు అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ విద్యార్థుల అభ్యసన సంసిద్ధత, రవాణా సౌకర్యం వంటి అంశాలను పరిగణలోకి తీసుకోకుండా పాఠశాలల పనివేళలను పెంచడం సరికాదన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో 5 నుంచి 15 కిలోమీటర్ల దూరం నుంచి విద్యార్థులు పాఠశాలలకు వస్తారన్నారు. సకాలంలో రవాణా సౌకర్యం లేకపోవడం వల్ల బాలికలకు భద్రతాపరమైన సమస్యలు ఉత్పన్నమవుతాయన్నారు.

జోరుగా టీడీపీ సభ్యత్వ నమోదు

ఓజిలి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఓజిలి మండలంలో టీడీపీ సభ్యత్వ నమోదు జోరుగా సాగుతోంది. పార్టీ మండల కన్వీనరు గుజ్జలపూడి విజయకుమార్ నాయుడు అధ్వర్యంలో క్లస్టర్ ఇన్‌చార్జిలు సభ్యత్వ నమోదును పర్యవేక్షిస్తున్నారు. మండలంలో ఇప్పటి వరకు 60 శాతం సభ్యత్వ నమోదు పూర్తి చేసినట్లు పార్టీ నేతలు తెలిపారు.

సంఘమేశ్వరుడికి అన్నాభిషేకం



కోట, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గూడలిలో గల కామాక్షీ దేవి సమేత సంఘమేశ్వర ఆలయంలో మంగళవారం కార్తీక మాస పూజలు జరిగాయి. ప్రముఖ వ్యాపారవేత్త శ్రీనివాసులు కుటుంబసభ్యుల ఆధ్వర్యంలో ఆలయ ప్రధానార్చకుడు కార్తీక్‌స్వామి సంఘమేశ్వరుడి మూలవిరాట్‌కి రుద్రాభిషేకం, అన్నాభిషేకం చేశారు. సంఘమేశ్వరుడి మూల విరాట్‌ను అన్నంతో అలంకరించారు. భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం శ్రీనివాసులు దంపతుల ఆధ్వర్యంలో స్వామి, అమ్మవార్లఉత్సవ విగ్రహాలతో గూడలి పురవీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు.

ప్రభుత్వ భూముల ఆక్రమణను అడ్డుకోండి

ఓజిలి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఓజిలి మండలంలో ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురికాకుండా వీఆర్వోలు అడ్డుకోవాలని తహసీల్దారు పద్మావతి సూచించారు. మంగళవారం వీఆర్వోలతో సమావేశం నిర్వహించారు. ఇప్పటికే ఆక్రమణలలో ఉన్న భూముల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశామని తెలిపారు. మేత పోరంబోకు, గ్రామనత్తం భూములపై దృష్టి పెట్టాలని తహసీల్దారు అన్నారు.

జేవీవీ ఆధ్వర్యంలో అన్నదానం

గూడూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక గమ్మళ్లపాళెంలోని వృద్ధాశ్రమంలో మంగళవారం జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో చెంచు నారాయణ, పురుషోత్తమ రావు, విజయబాబు, హిబ్రహి, శరత్ చంద్ర తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా స్థానిక అడవయ్య కాలనీలోని అనాథ శరణాలయంలో వృద్ధులకు బాస్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో గోరపాటి రవీంద్ర బాబు, సురేంద్ర, సుధీర్, బాషా ఛాన్, గఫూర్ పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కృషి

గూడూరు అర్బన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఏబీవీపీ నగర కార్యదర్శి నజీర్ అన్నారు. మంగళవారం పట్టణంలోని ఓ ప్రైవేటు జూనియర్ కళాశాలలో ఏబీవీపీ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. నగర కార్యదర్శిగా నజీర్‌ను ఏన్నుకున్నారు.

విత్తన శుద్ధికి ప్రాధాన్యం ఇవ్వండి

ఓజిలి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): రైతులు వివిధ పంటల సాగుకు మేలు రకాల వంగడాలను ఎంపిక చేసుకుని విత్తన శుద్ధికి ప్రాధాన్యం ఇవ్వాలని ఏవో విజయలక్ష్మి అన్నారు. ఓజిలి మండలంలోని రుద్రాయపాళెం, ఆచార్లపార్లపల్లి గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. పంటల సాగులో మెలకువలు, ఎరువులు, పురుగు మందుల వాడకం తదితర విషయాలపై రైతులకు అవగాహన కల్పించారు.

మద్యం బాటిళ్ల స్వాధీనం

వాకాడు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జెమినీ కొత్తపాళెం గ్రామానికి చెందిన కుంబాల అంకయ్య వద్ద 11 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు వాకాడు ఎక్సైజ్ సీఐ ప్రసాద్ తెలిపారు. బెల్టుషాపులు నిర్వహించిన, అక్రమంగా మద్యం తరలించినా చర్యలు తీసుకుంటామన్నారు.

ఎల్లి పంటకు ఊపిరి

● వర్షాలతో కళకళలాడుతున్న వరి



మోదుగులపాలెంలో కళకళలాడుతున్న ఎల్లి పైరు

పెళ్లకూరు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో గత వారం రోజులుగా అడపాదడపా కురుస్తున్న వర్షాలు ఎల్లి సాగు చేసిన వరి పంటలకు ఊపిరిపోశాయి. పెళ్లకూరు మండలంలో 12000 ఎకరాలు మాగాణి భూములు, 4000 ఎకరాలు మెట్ట భూములు ఉన్నాయి. ఈ భూముల్లో రైతులు అధికంగా రబీ సీజన్‌లో వరి సాగు చేస్తారు. ఇటీవల కురిసిన వర్షాలకు తోడు చెంబేడు, పునబాక, అర్ధమాల, చిల్లకూరు, పెళ్లకూరు తదితర చెరువులకు తెలుగుగంగ నీరు చేరడంతో రైతులు నారుమడులు సిద్ధం చేసుకుని వరినాట్లు చేపట్టారు. కాగా, మెట్ట ప్రాంతాలైన సంగాలపల్లి, చెన్నప్పనాయుడుపేట, మోదుగులపాలెం, బంగారంపేట, నందిమాల తదితర గ్రామాల్లో సుమారు 600 ఎకరాలకు పైగా వరి ఎల్లి పైర్లను సాగు చేస్తున్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు వరి పంటలు, ఉద్యాన పంటలు కళకళలాడుతున్నాయి. ముసురు వర్షాలతో వరినాట్లు వేసిన రైతులతో పాటు, ఎల్లి పంటలు వేసిన రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఆక్రమణలు తొలగించకపోతే చర్యలు


దుకాణదారులతో మాట్లాడుతున్న ఈవో బాపిరెడ్డి

శ్రీకాళహస్తి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ఆలయ పరిసరాల్లో ఆక్రమణలు తొలగించకపోతే చర్యలు తప్పవని ఈవో బాపిరెడ్డి దుకాణ దారులను హెచ్చరించారు. మంగళవారం ఆయన పురపాలక సంఘం, పోలీసు అధికారులతో కలిసి జల వినాయకస్వామి ఆలయం నుంచి లోబావి వరకు తనిఖీ చేశారు. పలు దుకాణాల వద్ద రేకుల కట్టడాలు రోడ్డుపైకి చొచుకు రావడాన్ని పరిశీలించారు. అదే విధంగా అక్రమంగా పెట్టుకున్న తోపుడు బండ్లను గుర్తించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ... రానున్న మహాశివరాత్రిని పురస్కరించుకుని ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా ఆక్రమణలు తొలగించాలన్నారు. 1వ పట్టణ సీఐ గోపి, పురపాలకసంఘ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో ప్రముఖులు


ఆలయ ధ్వజ స్తంభం వద్ద ఉన్న ప్రముఖులు

శ్రీకాళహస్తి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరుడిని పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. టిడ్కో చైర్మన్ వేములపాటి అజయ్‌కుమార్, టీటీడీ బోర్డు సభ్యులు మహేందర్‌రెడ్డి, అనుగోలు రంగశ్రీ దర్శించుకున్న వారిలో ఉన్నారు. ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధి వద్ద వేదపండితులు వారిని ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మరుగుదొడ్ల పరిశీలన



మరుగుదొడ్లను పరిశీలిస్తున్న విజయకుమార్ తదితరులు

శ్రీకాళహస్తి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): పురపాలక సంఘ ఆధ్వర్యంలో నిర్మించిన మరుగుదొడ్లను టీడీపీ పట్టణ అధ్యక్షుడు విజయకుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2014-19 మధ్య అప్పటి మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో అమృత్ నిధులతో పురపాలక సంఘానికి అవసరమైన పారిశుధ్య యంత్రాలను అందుబాటులోకి తీసుకువచ్చారన్నారు. అలాగే పట్టణ పరిధిలో మరుగుదొడ్లను ఏర్పాటు చేయించారన్నారు. అయితే వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత వాటికి తాళాలు వేసిన పరిస్థితి నెలకొందన్నారు. అనంతరం పురపాలక సంఘ కమిషనర్‌ను కలిసి ప్రభుత్వాస్పత్రి సమీపంలో ఉన్న మరుగుదొడ్లను వినియోగంలోకి తీసుకురావాలని కోరామన్నారు.

బీజేపీ సభ్యత్వంలో రెండో స్థానం

మొక్కులు చెల్లించిన పార్టీ నాయకులు

శ్రీకాళహస్తి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో బీజేపీ సభ్యత్వాలు 50వేలు మైలురాయి దాటడంతో ఆ పార్టీ నాయకులు ఆలయాల్లో మొక్కులు చెల్లించారు. తిరుత్తణి సుబ్రహ్మణ్యస్వామికి తలనీలాలు సమర్పించిన అనంతరం అప్పలాయగుంట ప్రసన్న వేంకటేశ్వరస్వామిని, కపిలతీర్థంలోని కపిలేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా బీజేపీ అసెంబ్లీ కో-కన్వీనర్ మేళాగారం సుబ్రహ్మణ్యంరెడ్డి మాట్లాడుతూ... పార్టీ సభ్యత్వాలు 50వేలు అధిగమించి రాష్ట్రంలో రెండో స్థానంలో నిలిచామన్నారు. అందులో భాగంగానే పలు ఆలయాలను సందర్శించి మొక్కులు చెల్లించుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు హరీశ్‌రాయల్, భరత్‌నాయుడు, రాఘవనాయుడు, హరీశ్‌రెడ్డి, కుమార్, సుబ్రహ్మణ్యం, సుబ్బు తదితరులున్నారు.

ప్రకృతి వ్యవసాయంపై మక్కువ పెంచుకోండి

రేణిగుంట, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయంపై మక్కువ పెంచుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి ప్రసాదరావు సూచించారు. మండలంలోని చైతన్యపురం రాస్ కృషి విజ్ఞాన కేంద్రంలో కేవీబీపురం మండలానికి చెందిన కొత్తూరు, రాగిగుంట, రైతులకు విశిష్ట రకం వేరుశనగ విత్తనం, విత్తనశుద్ధి మందును పంపిణీ చేశారు. వేరుశనగ సాగుకు జిల్లాలో ఉన్న అనుకూతల, రైతు సేవా కేంద్రాల ద్వారా అందిస్తున్న సేవలను, పీఎం కిసాన్, పంట బీమా పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో కేవీకే సభ్యులు పాల్గొన్నారు.

రైలు కింద పడి గుర్తు తెలియని యువకుడి ఆత్మహత్య

రేణిగుంట, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): రైలు కిందపడి గుర్తు తెలియని యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మంగళవారం ఉదయం రేణిగుంట మండలంలోని కృష్ణాపురం రైల్వేగేటు సమీపంలో జరిగింది. జీఆర్‌పీ ఎస్‌ఐ రవి తెలిపిన వివరాల మేరకు... మంగళవారం తెల్లవారుజామున కృష్ణాపురం రైల్వే గేటు సమీపంలో ట్రాక్‌మేన్ విధులు నిర్వహిస్తుండగా రైలు పట్టాలపై మృతదేహాన్ని గుర్తించి సమాచారం ఇచ్చాడు. వెంటనే సిబ్బందితో ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. సుమారు 35 సంవత్సరాలు వయసు గల యువకుడి మృతదేహంపై ఎర్ర టీషర్టు, నల్ల ప్యాంటు ఉన్నాయి. ఇతర వివరాలు లభించలేదని జీఆర్పీ ఎస్‌ఐ రవి చెప్పారు. ఈమేరకు కేసు నమోదు చేశారు.

నేడు లక్ష బిల్వార్చన, కుంకుమార్చన

శ్రీకాళహస్తి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో బుధవారం లక్ష బిల్వార్చన, కుంకుమార్చన నిర్వహించనున్నట్లు ఈవో బాపిరెడ్డి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఉదయం 7గంటలకు ఆలయ అలంకార మండపంలో లక్ష బిల్వార్చన, కుంకుమార్చన జరుగుతుందన్నారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొనాలని కోరారు.

ఇష్టారాజ్యంగా పార్కింగ్!

తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాల ఆవరణలో రాకపోకలకు ఇబ్బందులు



తహసీల్దార్ కార్యాలయం ముందు, ఆవరణలో ఇష్టారాజ్యంగా నిలిపి ఉన్న వాహనాలు

నాగలాపురం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణ అనధికార వాహనాల పార్కింగ్‌కు వేదికైంది. తహసీల్దార్ కార్యాలయం బజారు వీధిలో ఉండడంతో బయట ప్రాంతాలకు, పనులకు వెళ్లే వారు కూడా తమ వాహనాలను ఇక్కడ పార్క్ చేసి దర్జాగా వెళ్లిపోతున్నారు. అదే విధంగా ప్రైవేట్ కార్లు కూడా ఇక్కడ పార్క్ చేయడంతో ఇక్కడి ప్రభుత్వాధికారుల వాహనాలు ఎక్కడ నిలపాలో తెలియక ఇబ్బంది పడుతున్నారు. సాయంత్రం వరకు కార్యాలయ ఆవరణలో ద్విచక్ర వాహనాలు, ప్రైవేట్ వ్యక్తుల వాహనాలతో రాకపోకలకు కూడా ఇబ్బందిగా మారింది. ఇకనైనా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంది.

కంటి వైద్యశిబిరానికి స్పందన



ఏర్పేడు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాపానాయుడుపేట రాస్ సేవా నిలయంలో తిరుపతికి చెందిన అరవింద్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. డాక్టర్ శ్రేయ కంటి చూపు పరిరక్షణకు తీసుకోవాల్సిన ఆహార పదార్థాలను వివరించారు. కంటి సమస్యలు వచ్చినపుడు వైద్యులను సంప్రదించాలన్నారు. అనంతరం 240మందికి పరీక్షలు నిర్వహించి 58మందిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో బాలాజీరెడ్డి, అన్నాదొరై, వెంకటకుమార్, మునీంద్ర పాల్గొన్నారు.

లో వోల్టేజీ సమస్య పరిష్కారానికి కృషి


దిమ్మెను పరిశీలిస్తున్న అధికారులు

వరదయ్యపాళెం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాల సమీపంలోని ఇందిరానగర్, పద్మావతిపురంలలో లోవోల్టేజీ సమస్య పరిష్కారానికి ట్రాన్స్‌కో అధికారులు చర్యలు చేపట్టారు. ఇందిరానగ్ పంచాయతీ నూతన సచివాలయం ముందు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు దిమ్మె నిర్మించారు. ప్రత్యేక విద్యుత్ లైన్, స్తంభాలను ఏర్పాటు చేస్తామన్నారు. మండలంలో లోవోల్టేజీని యుద్ధప్రతిపాదికన పరిష్కరిస్తామన్నారు.

టీడీపీతోనే వన్నియకుల క్షత్రియుల అభివృద్ధి


సీఆర్ రాజన్, మిన్నల రవికి సన్మానం

శ్రీకాళహస్తి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వన్నియకుల క్షత్రియ కులానికి టీడీపీతోనే ఆదరణ లభించిందని వన్నియకుల క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ సీఆర్ రాజన్, డైరెక్టర్ మిన్నల రవి అన్నారు. మంగళవారం వారు మాట్లాడుతూ రాష్ట్రంలో వెనుక బడిన కులాలు అన్ని రంగాల్లో రాణించేందుకు అవసరమైన అవకాశాలను సీఎం చంద్రబాబు కల్పిస్తున్నారన్నారు. కూటమి, ప్రభుత్వ లక్ష్యాలను సాధించ డానికి సమష్టిగా పనిచేస్తామని సీఆర్ రాజన్ అన్నారు. గత వైసీపీ పాలనలో దౌర్జన్యాలకు బలైన అనేక సంఘటలను దృష్టిలో ఉంచుకుని బీసీ వర్గాల వారికి చట్టపరమైన రక్షణ కల్పించడానికి సీఎం కృషి చేస్తున్నారని తెలిపారు. అనంతరం సీఆర్ రాజన్, మిన్నల రవి, బాలసుబ్రహ్మణ్యంను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్‌రెడ్డి, చంద్రారెడ్డి, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా సంకటహర చతుర్ధశి


వేద పండితుల ఆధ్వర్యంలో జరిగిన హోమం

శ్రీకాళహస్తి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలోని అంజంజి వినాయకస్వామి ఆలయం వద్ద సంకట హర చతుర్థశిని శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. ప్రతి కుటుంబం గణపతి హోమం నిర్వహించుకునే విధంగా సంకట హర చతుర్థశి నాటి హోమాన్ని ఆర్జిత సేవగా తీసుకువచ్చారు. ఇందులో భాగంగా మంగళవారం అంజంజి వినాయక స్వామి ఆలయం వద్ద కలశ స్థాపన చేసి హోమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈవో బాపిరెడ్డి దంపతులు, ఆలయ అధికారులు, వేదపండితులు తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జుల పాలనతో సరి

కేవీబీపురం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలో గత మూడు నెలలుగా ఇన్‌చార్జి అధికారుల పాలన సాగుతోంది. సార్వత్రిక ఎన్నికల అనంతరం ఇక్కడ పని చేస్తున్న తహసీల్దారు బదిలీపై వెళ్లిపోయారు. వెంటనే మరో తహసీల్దారును నియమించారు. అయితే నెల తిరగక ముందే బదిలీపై వెళ్లిపోయారు. ప్రస్తుతానికి డీటీ మునిరత్నంరెడ్డి ఇన్‌చార్జి తహసీల్దారుగా కొనసాగుతున్నారు. అలాగే ఇక్కడ పని చేస్తున్న ఎంపీడీవో బదిలీపై వెళ్లడంతో ఆయన స్థానంలో పిచ్చాటూరు నుంచి రాధారాణి ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. అలాగే స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐ బదిలీ కావడంతో ఆయన స్థానంలో పిచ్చాటూరు ఎస్‌ఐ వెంకటేశ్వర్లు ఇన్‌చార్జిగా కొనసాగుతున్నారు. ప్రధాన అధికారులందరూ పాలన వ్యవస్థకు ముఖ్యమైన వారు. వీరి స్థానాల్లో ఇన్‌చార్జులతో మండల పరిపాలన సాగుతోంది. దీంతో పాలను కుంటుపడుతోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రెగ్యులర్ అధికారులను నియమించాల్సి ఉంది.

ఘనంగా ఇందిరాగాంధీ జయంతి

శ్రీకాళహస్తి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం దివంగత ప్రధానమంత్రి ఇందిరాగాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బ్యాంకుల జాతీయాకరణ, పేదలకు ఇళ్ల నిర్మించిన ఘనత ఆమెకే చెందుతుందన్నారు. డాక్టర్ బత్తెయ్యనాయుడు, వెంకటముని, ఇర్ల గోపి, నాగూరయ్య, తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త తలపా దామోదర్‌రెడ్డి ఆధ్వర్యంలో కూడా ఇందిరాగాంధీ జయంతి వేడుకలు జరిగాయి.

ఆక్రమణల తొలగింపు



బుచ్చినాయుడుకండ్రిగ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెస్ట్ వరత్తూరులో దారి ఆక్రమణలను వీఆర్‌వో మురళి సిబ్బందితో కలసి ఎక్స్‌కవేటర్ సాయంతో తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలోని సచివాలయం పక్కనే ఉన్న దారి ఆక్రమణకు గురికావడంతో గ్రామస్తులు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారన్నారు. తహసీల్దార్ ఆదేశాలతో ఆక్రమణలు తొలగించినట్టు తెలిపారు.

రెండో రోజూ కొనసాగిన క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు


వివరాలు నమోదు చేస్తున్న వైద్య సిబ్బంది

సత్యవేడు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని దాసుకుప్పం పీహెచ్‌సీ పరిధిలోని ఏఎంపురం, కన్నవరం గ్రామాల్లో మంగళవారం పింక్ బస్సుల ద్వారా మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు రెండో రోజు నిర్వహించారు. స్విమ్స్ శ్రీబాలాజీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అంకాలజీ ఆధ్వర్యంలో పింక్ బస్సు ద్వారా నోరు, రొమ్ము, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ పరీక్షలను నిర్వహించారు. దాసుకుప్పం పీహెచ్‌సీ వైద్యాధికారి గుణశేఖర్, స్విమ్స్ క్యాన్సర్ యూనిట్ పీఆర్‌వో చంద్రమోహన్ పర్యవేక్షణలో డాక్టర్లు చైతన్యబాను, హరిత బృందం పరీక్షలు నిర్వహించారు. సర్పంచ్‌లు జయంతి, శిరీష ఎంపీటీసీ సభ్యురాలు ధనలక్ష్మి, ఎంపీహెచ్‌ఈవో సుబ్రమణ్యం, పంచాయతీ కార్యదర్శులు లీలామాధవ్, యుగంధర్, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

అపార్‌ను త్వరగా పూర్తి చేయండి

బుచ్చినాయుడుకండ్రిగ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో అపార్ నమోదు కార్యక్రమాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని విద్యాశాఖ జిల్లా ప్లానింగ్ అధికారి రామచంద్రారెడ్డి తెలిపారు. మండలంలోని పల్లమాల ఉన్నత పాఠశాలలో గణిత పాఠ్యాంశ శిక్షణ కార్యక్రమాన్ని పరిశీలించారు.

నేడు వ్యాసరచన పోటీలు

ఏర్పేడు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు మాతృభాషపై అభిమానంతో పాటు పుస్తక పఠనంపై శ్రద్ధ కల్పించే విధంగా ప్రజా కళావేదిక, 1983-84 పూర్వవిద్యార్థులు కలిసి వ్యాసరచన పోటీలను ఈనెల 20న బుధవారం నిర్వహించనున్నారు. ఏర్పేడు జడ్పీ ఉన్నత పాఠశాలలో 9, 10వ తరగతి విద్యార్థులకు పోటీలు నిర్వహిస్తారు. మొదటి మూడు స్థానాల్లో నిలిచిన వారికి రూ.516, రూ.316, రూ.216, ప్రశంసా పత్రం, జ్ఞాపిక అందజేస్తారు.

శాస్త్రోక్తంగా ఆకాశదీపం


ఆకాశదీపాన్ని వెలిగిస్తున్న అధికారులు

శ్రీకాళహస్తి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరాలయంలో మంగళవారం ఆకాశదీపాన్ని శాస్త్రోక్తంగా వెలిగించారు. కార్తీక మాసంలో ప్రతి రోజు ఆకాశదీపాన్ని వెలిగిస్తుంటారు. ఇందులో భాగంగా ఆలయ వేదపండితులు ఊంజల్ మండపం వద్ద కార్తీక దీపానికి పూజలు చేసిన అనంతరం ఆకాశదీపంగా ఎగురవేశారు.

కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి సాదర స్వాగతం


మంత్రికి స్వాగతం పలుకుతున్న అధికారులు

రేణిగుంట, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): కేంద్ర బొగ్గు, గనులశాఖ మంత్రి కిషన్‌రెడ్డికి తిరుపతి విమానాశ్రయంలో మంగళవారం రాత్రి సాదర స్వాగతం లభించింది. శ్రీవారి దర్శనార్థం ఇండిగో విమానంలో హైదరాబాద్ నుంచి తిరుపతి విమానాశ్రయానికి చేరుకున్న ఆయనకు శ్రీకాళహస్తి ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి, ఇతర శాఖల అధికారులు, బీజేపీ నాయకులు సాదర స్వాగతం పలికారు. అనంతరం ఆయన రోడ్డు మార్గాన తిరుమలకు వెళ్లారు.

మంత్రి లోకేశ్‌తో జడ్పీటీసీ మాజీ సభ్యుడి భేటీ


లోకేశ్‌తో మాట్లాడుతున్న కరుణాకరనాయుడు

వరదయ్యపాళెం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో మంగళవారం విద్యాశాఖ మంత్రి లోకేశ్‌ను వరదయ్యపాళెం మండల జడ్పీటీసీ మాజీ సభ్యుడు కరుణాకర నాయుడు మర్యాద పూర్వకంగా కలిశారు. సత్యవేడు నియోజకవర్గంలో నెలకొన్న పరిస్థితులను, అభివృద్ధి కార్యక్రమాలను మంత్రికి వివరించారు. ఎమ్మెల్యే ఆదిమూలాన్ని పరిపాలన దిశగా ప్రజల వద్దకు పంపాలని కోరారు. స్పందించిన మంత్రి సత్యవేడు నియోజకవర్గంలో ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చినట్టు కరుణాకర నాయుడు చెప్పారు.

అందుబాటులో మామిడి, కొబ్బరి మొక్కలు

శ్రీకాళహస్తి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీకాళహస్తి ఉద్యాన క్షేత్రంలో మామిడి, కొబ్బరి మొక్కలు అందుబాటులో ఉన్నాయని ఉద్యాన వన శాఖ అధికారి తెలిపారు. మామిడిలో బేనీషా, మల్లికా, తోతాపురి రకాల మొక్కలు అందుబాటులో ఉన్నాయన్నారు. కావాల్సిన రైతులు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 వరకు విక్రయిస్తామన్నారు. వివరాలకు నెం.7995086968, 9100411321లలో సంప్రదించాలన్నారు.

భవిత పాఠశాల పరిశీలన

బుచ్చినాయుడుకండ్రిగ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని భవిత పాఠశాలను జిల్లా విద్యాశాఖ ఐఈ కోఆర్డినేటర్ చంద్రశేఖర్ రెడ్డి మంగళవారం పరిశీలించారు. పాఠశాలలోని రికార్డులు, రిజిస్టర్లను తనిఖీ చేశారు. ప్రత్యేక ప్రతిభావంతులకు అర్థమయ్యేరీతిలో విద్యా బోధన ఉండాలన్నారు. వారిలో సృజనాత్మకతను గుర్తించాలన్నారు. ఉపాధ్యాయుడు అయ్యప్ప తదితరులు పాల్గొన్నారు.